
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

3

సోమవారం 19 మే 2025

చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	23.4

పొంచి ఉన్న తాగునీటి గండం?

● తగ్గుతున్న సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 512.7 అడుగులకు పడిపోయింది. దీంతో సాగర్, కృష్ణాజలాలపై ఆధారపడిన హైదరాబాద్ జంట నగరాలు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీటి గండం పొంచి ఉంది.

4

యుద్ధప్రాతిపదికన పనులు చేయాలి

● నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ అసంతృప్తి



జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు, మే 18 (ఆంధ్రజ్యోతి) : బేటీతండా, జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని ఎత్తిపోతల పథకాలను ఆయన పరిశీలించారు. రూ.34 కోట్లతో చేపట్టిన బేటీతండా ఎత్తిపోతల పథకం ద్వారా 2,041 ఎకరాలు సాగు చేయవచ్చని సుమారు 2,176 మంది రైతులు లబ్ధిపొందుతారన్నారు. బేటీతండా పథకం ద్వారా 90శాతం మంది బెట్టెతండా గిరిజనులకు లబ్ధిచేకూరుతుందన్నారు. అనంతరం జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. పనుల తీరును చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకానికి నిధులు మంజూరు చేయించానని, పనులు మాత్రం జరగడం లేదన్నారు. నవంబరులోగా పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను, అధికారులకు ఆదేశించారు. భూసేకరణ కోసం కలెక్టర్‌కు రూ.2.59 కోట్లు నిధులు అం దించినట్లు తెలిపారు. పథకం ద్వారా పాలకవీడు మండలంలోని కోమటికుంట, జాన్‌పహాడ్, చెర్వుతండా, గుండ్లపహాడ్, గుండెబోయినగూడెం, అలింగాపురం, బొత్తలపాలెం, రాఘవాపురం, మీగడంపాడుతండాలకు సాగునీరు అందుతుందన్నారు. సుమారు 5,650 ఎకరాలకు సాగునీరందుతుందని, సుమారు 7వేల మంది రైతులకు లబ్ధిచేకూరుతుందన్నారు. ఈ పథకం ద్వారా ఇంకా కొన్ని గ్రామాలకు సాగు నీరందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎస్సెస్సీ సీతఃరమేష్ బాబు, భూక్యా గోపాల్, మోతీలాల్, సుబ్బారావు, నర్సింహారావు పాల్గొన్నారు.

థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు వెదురు గుళికలు

కాలుష్య నియంత్రణే లక్ష్యంగా..



నల్లగొండ మండలం ఎం.దుప్పలపల్లిలో వెదురుసాగును పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి అనంతరెడ్డి



థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్లలో వినియోగించే బొగ్గుతో పెద్ద ఎత్తున కాలుష్యం వెలువడుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా వెదురును గుళికలరూపంలో తయారు చేసి థర్మల్ పవర్ ప్లాంట్లకు ఉపయోగించడం కోసం ప్రణాళికలను సిద్ధంచేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తొలి విడతలో 250 ఎకరాల్లో సాగు చేపట్టాలని, ఇందుకు రైతులను ప్రోత్సహించాలని నిర్ణయించింది.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

రాష్ట్ర ప్రభుత్వం వెదురు సాగును ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో జాతీయ వెదురు మిషన్ పథకం కింద రైతులకు రాయితీలు ఇవ్వనున్నారు. సాగును ప్రోత్సహించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా చర్యలు చేపడుతున్నారు. నల్లగొండ జిల్లాలో 90.44ఎకరాల్లో సాగు చేపడుతుండగా, మిగతా 160 ఎకరాల వరకు సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో చేపట్టనున్నారు. వరి సాగుకు అధిక నీటితో పాటు విద్యుత్ వినియోగం కూడా అధికమవుతుంది. దీంతో రైతులు పంటమార్పిడిలో భాగంగా వెదురును సాగుచేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు. రాబోయే రోజుల్లో వేలాది ఎకరాల్లో వెదురు సాగు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించడానికి ఈ వెదురు(ఆకుపచ్చ బంగారం)ను సారవంతంలేని భూముల్లో కూడా సాగు చేయవచ్చు. నీటి సౌకర్యం ఉంటే వెదురును సులభంగా సాగుచేసే అవకాశాలున్నాయి. రైతుల ఆర్థికవృద్ధికి దోహదపడే విధంగా ఈ పంటను గుర్తించారు. విస్తరణ పెరిగే కొద్ది మార్కెట్ కూడా పెరిగే అవకాశాలుంటాయి.

వెదురు గుళికలకు ప్రాముఖ్యం ఇవ్వడానికి..

రాష్ట్రంలో మొత్తం ఎనిమిది థర్మల్ పవర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటన్నింటికీ 10 శాతం కోఫైరింగ్ బయోమాస్ వెదురు గుళికలు (పెల్లెట్స్) తప్పకుండా వాడాలన్న పాలసీని మినిస్ట్రీ ఆఫ్ పవర్ 2021 సంవత్సరంలో సిఫారసు చేసింది. ఈ ఎనిమిది పవర్ ప్లాంట్ల రోజుకు 18,403 టన్నుల బాంబ్ పెల్లెట్స్ అవసరం ఉంటుంది. అంటే సంవత్సరానికి రూ.6700కోట్ల విలువైన వెదురు మార్కెటింగ్ రైతులకు లాభదాయకంగా మారనుంది. 67లక్షల వెదురు గుళికల లక్ష్యం సాధించడంకోసం వెదురు సాగును పెద్దఎత్తున చేపట్టడానికి సన్నాహాలు మొదలయ్యాయి. వెదురు సాగు వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి రావడంతోపాటు చీడ పీడలు, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. బొగ్గు వినియోగంతో ఏటా 21లక్షల టన్నుల కార్బన్‌డైఆక్సైడ్ విడుదలవుతుందని విద్యుత్ శాఖ నివేదికలో తెలిపింది. థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్‌లను వెదురు గుళికలు వాడటానికి ప్రధాన కారణం ఇందులో బూడిద శాతం తక్కువ ఉంటుంది. అంటే బొగ్గులో 20శాతం ఉంటే వెదురులో మాత్రం 1.5శాతం మాత్రమే బూడిద ఉంటుంది. బొగ్గును మండించే సమయంలో వెదురు గుళికలను 7శాతం వినియోగించాలని జాతీయ ఇందన విధానంలో కేంద్రం స్పష్టం చేసింది. ఈ విధానంతో తెలంగాణలో వెదురుకు డిమాండ్ పెరిగింది. రాబోయే రోజుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెదురు సాగు భారీగా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వెదురు ఉత్పత్తులు.. గుళికల రూపంలోకి..

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా వెదురు సాగును ముమ్మరంగా చేపట్టి ఆ తర్వాత ఆ వెదురు ఉత్పత్తులను గుళికల (పెల్లెట్స్)లోకి మార్చడానికి నిర్ణయించారు. జాతీయ వెదురు మిషన్ పథకం కింద ఈ గుళికలను తయారుచేసి వాటిని...

మిగతా 4వ పేజీలో..

సాగుకు అనుకూలమైన వెదురు రకాలు



పొలాల్లో సాగుకు అనుకూలమైన రకాలను ఉద్యానశాఖ అధికారులు గుర్తించారు. ఉద్యానశాఖ ద్వారా జాతీయ వెదురు పథకం(ఎన్‌బీఎం) కింద వెదురు సాగు చేసే రైతులకు సబ్సిడీ అందజేస్తున్నారు. ఎకరాకు 50శాతం రాయితీ కింద రూ.24వేలు ఇస్తారు. ఇందులో మొదటి సంవత్సరం రూ.14,400, రెండో సంవత్సరం రూ.9600ను రైతుల ఖాతాలో నేరుగా జమ చేస్తారు. వెదురు రకాలను పరిశీలిస్తే బంబ్‌సాహల్దా, బంబ్‌సాబాల్‌కోవా(భీమా వెదురు) ఇవి ముఖ్యంగా ఎత్తుగా, నిటారుగా పెరుగుతాయి. ఇవి అధిక దిగుబడి ఇస్తాయని గుర్తించారు. వీటితోపాటు డెండ్రో కెలామోస్ లాటిఫ్లోరెస్, డెండ్రో కెలామోస్ బాండ్రీసీ కూడా మూడున్నర సంవత్సరాల వ్యవధిలోని మొదటిసారి కోతకు వస్తుంది. మిగతా రకాలకు నాలుగేళ్ల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. అంతర పంటగా అల్లం, పసుపు సాగు చేయవచ్చు. ప్రస్తుతం వెదురుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మార్కెట్‌లో టన్ను వెదురు ధర రూ.3వేల నుంచి రూ.4వేల వరకు పలుకుతుంది. ఈ రకాల సాగుతో ఎకరాకు 40టన్నుల వరకు దిగుబడి చేసే అవకాశం ఉంది.

నిర్మాణరంగంపై.. ధరాఘాతం

సామాన్యులు, మధ్యతరగతి వారికి సొంత ఇంటి కల... ఇక కలగానే మిగిలిపోయేట్టు కనిపిస్తోంది. రెండు నెలల్లోనే స్టీలు, సిమెంటు, ఇసుక, ఇటుక ఇతరత్రా సామగ్రి ధరలు అనూహ్యంగా 50శాతం పెరిగాయి. దీంతో వ్యక్తిగత ఇల్లు, అపార్టుమెంట్ల నిర్మాణ వ్యయం అధికంకావడంతో సామాన్యులు, అపార్టుమెంట్ వెంచర్లు చేపట్టిన బిల్డర్లు తల పట్టుకుంటున్నారు. నిర్మాణ పనులను నిలిపివేశారు.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

● నిర్మాణ సామగ్రి ధరలు పైపైకి ● పెరిగిన సిమెంటు, ఐరన్ ధరలు
● రూ.300 నుంచి రూ.380వరకు పెరిగిన సిమెంటు బస్తా
● టన్నుకు రూ.3వేలు పెరిగిన స్టీలు ధరలు
● రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం
● సొంతగూడు కట్టుకునే వారిపై అదనపు భారం



భూదాన్‌పోచంపల్లిలో కొనసాగుతున్న భవన నిర్మాణం

పెరుగుతున్న సిమెంటు, స్టీలు ధరలు సామాన్యుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంటు, స్టీల్, ఇసుకతోపాటు శానిటరీ వస్తువుల ధరలు 50శాతం పెరిగాయి. రెండు నెలల క్రితం టన్ను స్టీల్ ధర రూ.45వేలు ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.65 వేలకు పెరిగింది. బస్తా (50 కిలోలు) సిమెంటు ధర రూ.220 నుంచి రూ.380కి ఎగబాకింది. కంకర ధర ట్రాక్టర్ (100ఫీట్లు) రూ.2400 నుంచి రూ.3400కు చేరుకున్నది. గృహ నిర్మాణానికి అవసరమైన ఇసుక ధర 30 శాతం పెరిగింది. ఇళ్లల్లో గోడలకు వేసే పెయింటింగ్ ధరలు కూడా 30 శాతం మేరకు పెరిగాయి. 20లీటర్ల డబ్బా రూ.1600 నుంచి రూ.1800లకు, ప్రీమియర్ రూ.2500 నుంచి రూ.2800కు పెరిగింది. వీటితోపాటు చెక్క, టైల్స్, గ్రానైట్, ఇలా అన్ని రకాల వస్తు సామగ్రి ధరలు పెరిగాయి. డీజిల్ ధరలు పెరగడంతో రవాణా చార్జీలు సైతం వాహన యజమానులు పెంచేశారు. నిర్మాణ సామగ్రి తరలించేందుకు డీసీఎం, లారీ యజమానులు గతంలో కనీస చార్జీ రూ.800 వసూలు చేస్తే ప్రస్తుతం రూ.1600 తీసుకుంటున్నారు. నిర్మాణంలో కీలకమైన విద్యుత్, ప్లంబింగ్ పైపుల ధరలు రెండింతలయ్యాయి. ఇంటి నిర్మాణంలో ఉపయోగించే ఎలక్ట్రికల్ వస్తువుల ధరలు 60శాతం పెరిగాయి.

ఫిబ్రవరిలో 50 శాతానికిపైగా..

రెండు నెలల కిందట టన్ను స్టీల్ ధర రూ.45 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.65వేలకు పెరిగింది. ఈ ఏడాది జనవరి తొలి వారంలో ఉన్న ధరలు ఒక్కసారిగా ఫిబ్రవరి నెలలో 50శాతానికి పెరిగాయి. జిల్లావ్యాప్తంగా 200 దుకాణాలకుపైగా ఉన్నాయి. ఏ కంపెనీ అయినా టన్ను రూ.60వేలు పైమాటే. నెలరోజుల వ్యవధిలో అన్ని కంపెనీల సిమెంటు ధరలు రూ.40నుంచి రూ.50 వరకు పెరిగింది.

కంపెనీల సిండికేట్

మార్కెట్లో కృత్రిమ కొరతను సృష్టించి నిర్మాణ సామగ్రి కంపెనీలు, సరఫరాదారులు ధరలు పెంచుతున్నారు. సిమెంటు కంపెనీలు ప్రతి నెలా 10 రోజులపాటు ఉత్పత్తి, సరఫరా నిలిపివేస్తున్నాయని ప్రచారం సాగుతోంది. దీంతో మార్కెట్లో ధరలు పెరిగేలా చేస్తున్నాయి.

గనుల శాఖ బాదుడు

భవన నిర్మాణ రంగంపై మరో పిడుగు పడింది. గనుల శాఖ అన్ని రకాల ఫీజులను పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే 30 నుంచి 40 శాతం పెరిగిన కంకర, ఇసుక ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

నిలిచిన నిర్మాణ పనులు

ఉమ్మడి జిల్లాలో రూ.వందల కోట్ల పెట్టుబడితో వందలాదిగా అపార్టుమెంట్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. ఇవేగాక వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలు వేలాదిగా ఉన్నాయి. సిమెంటు, స్టీలు ధరలు పెరగడంతో కొన్ని నిర్మాణాలు నిలిచిపోగా, మరికొన్ని నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ధరలు పెరగక ముందు ఒక డబుల్ బెడ్‌రూమ్ ఇంటి నిర్మాణానికి రూ.40లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య రేటుతో డిపాజిట్లు తీసుకున్న బిల్డర్లు ఇప్పుడు నిర్మాణవ్యయం దారుణంగా పెరగడంతో వాటిని ఎట్లా పూర్తిచేయాలో తెలియక తల పట్టుకుంటున్నారు. ఇప్పటి ధరలకు వీటిని పూర్తి చేయలేరు. నిర్మాణ పనులకు విరామం ఇవ్వాలనే ఆలోచనలో బిల్డర్లు ఉన్నారు. ఇదే జరిగితే కార్మికులు పనులు లేక రోడ్డున పడతారు.

వ్యాపారం తగ్గిపోయింది



సిమెంటు, ఐరన్ ధరలు విపరీతంగా పెరగడంతో వ్యాపారం బాగా తగ్గిపోయింది. రోజుకు 150 నుంచి 250 వరకు సిమెంటు బస్తాలు విక్రయించేవాళ్లం. కానీ, ప్రస్తుతం 100 సిమెంటు బస్తాలను కూడా విక్రయించలేకపోతున్నా. సిమెంటుపై జీఎస్టీ 28శాతం నుంచి 18 శాతానికి తగ్గించాలి. అప్పుడు సిమెంటు రేటుపై కొంత భారం తగ్గే అవకాశం ఉంటుంది. వ్యాపారం జరిగేందుకు వెసలుబాటు ఉంటుంది.

ఇటమోని నరేందర్, సిమెంటు అండ్ ఐరన్ వ్యాపారి, భూదాన్‌పోచంపల్లి

సిమెంట్ బాటలోనే ఐరన్ ధరలు



నెల రోజుల క్రితం ఐరన్ టన్ను ధర రూ.60వేలు ఉండగా, ప్రస్తుతం రూ.65వేలకు పెరిగింది. వీటితోపాటు కలర్లు, ఇతర సామగ్రి ధరలు కూడా పెరిగాయి. రెండు నెలల క్రితం వరకు స్క్వేర్ ఫీట్ నిర్మాణ వ్యయం రూ.1700కాగా, ధరల పెరుగుదల కారణంగా రూ.2వేలకు చేరింది. ఒక్కో స్క్వేర్ ఫీటుపై రూ.300 అదనపు భారం పడుతోంది. రెండు వందల గజాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇంటి నిర్మాణానికి దాదాపు 800 బస్తాల సిమెంటు అవసరం ఉంటుంది. సిమెంటు బస్తాకు ధర రూ.50 పెరగడంతో రూ.40,000 అదనపు భారం పడుతోంది. అదేవిధంగా నాలుగు టన్నుల ఐరన్ అవసరం కాగా, టన్ను ధర రూ.5 వేలుచొప్పున పెరగడంతో మరో రూ.20వేలు అదనపు భారం పడుతోంది. ఈ రెండింటిపైన రూ.60వేలు అదనపు వ్యయం అవుతుంది. ఈనెలాఖరు నాటికి ధరల పెరుగుదల భారం రూ.లక్ష వరకు ఉంటుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ఇంటి నిర్మాణం కలగానే ఉంటుందని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

● వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



హైదరాబాద్‌లో తుమ్మల నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి మంత్రికి వినతిపత్రం అందజేశారు. సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగిన ప్రతీ రైతుకు త్వరగా రైతు భరోసా అందేలా చూడాలని, ఎరువులు, విత్తనాలు ఇచ్చేలా చొరవ చూపాలన్నారు. వీటితోపాటు 50శాతం సబ్సిడీతో వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు అందించాలని, ప్రణాళికను సిద్ధంచేసి యువతకు ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ లాభాల బాటలో ఉందని పేర్కొంటూ రైతులకు అందజేస్తున్న సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వర్‌రావు సానుకూలంగా స్పందించి రైతుల సంక్షేమంకోసం సొసైటీల బలోపేతంకోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు.

నిధులివ్వకుంటే కళాశాలలు బంద్

● ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఆందోళనబాటలో ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు
● నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి విన్నపం
● లేదంటే డిగ్రీ కళాశాలల మాదిరి బంద్‌కు కార్యాచరణ

ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాటపట్టనున్నాయి. నాలుగేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ ఇబ్బందిగా మారిందని, ప్రభుత్వం స్పందించకుంటే డిగ్రీ కళాశాలల మాదిరే ఆగస్టు నుంచి విద్యా సంస్థల బంద్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వానికి తమ ఇబ్బందులను నివేదించేందుకు అడ్ హక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ ప్రభుత్వం దృష్టికి తమ ఇబ్బందులను తీసుకెళ్లనుంది. (ఆంధ్రజ్యోతి-కోదాడ)

4

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ● ఏరియా ఆసుపత్రి వైద్యులతో సమీక్ష సమావేశం



మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చే రోగులకు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు, కార్మికులు, కూలీలు, పేద, మధ్యతరగతి ప్రజలు ఏదో రుగ్మతలతో బాధపడుతూ ఆసుపత్రికి వస్తుంటారన్నారు. అలాంటి వారికి దైవంతో సమానమైన వైద్యులు ధైర్యం చెప్పి తమ వైద్యసేవలతో సాంత్వన చేకూర్చేలా చూడాలన్నారు. సమయపాలన పాటించని వారు, డ్యూటీకి రాని వైద్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రిలోని వార్డులు శానిటైజ్ చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి దీటుగా ప్రభుత్వ వైద్యం అందించాలన్నారు. అన్ని వార్డుల్లో కలియదిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సమరథ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేశారు

గత పాలకులు మున్సిపాలిటీ ప్రజల సంక్షేమాన్ని మరిచి వ్యక్తిగత స్వలాభంకోసం రూ.లక్షల నిధులు దుర్వినియోగం చేశారని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ నేతలతో కలిసి పట్టణంలోని హనుమాన్‌పేట, రెడ్డికాలనీ, ముత్తిరెడ్డికుంట, తహసీల్దార్ కార్యాలయం వెనుక వీధి, సుందర్‌నగర్, రామాటాకీస్ వెనుక నుంచి చెరువు వరకు పర్యటించి ఓపెన్ డ్రైనేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా డ్రైనేజీ నిర్వహణను పట్టించుకోకపోవడంతో నాలా పరిసరాల ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారన్నారు. గత పాలకులు ధనార్జనే ధ్యేయంగా ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం వల్లే డ్రైనేజీ సమస్య జఠిలంగా మారిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్, సుందర్‌నగర్ ఇన్‌చార్జి అబ్దుల్లా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ కౌన్సిలర్ రవినాయక్ , 25 వార్డు ఇన్‌చార్జి జానకిరాం రెడ్డి, అడావత్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం..





యాదగిరీశుడి దివ్యక్షేత్రం ఆదివారం భక్తజనసంద్రమైంది. వేసవి సెలవులు, వారాంతపు సెలవు కలిసిరావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి ఇష్ట దైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో నిండిపోవడంతో స్థానికులు కాస్త ఇబ్బంది పడ్డారు. (యాదగిరిగుట్ట-ఆంధ్రజ్యోతి)

5

‘భూభారతి’పై ప్రజలకు వివరించాలి


● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



పొంగులేటికి స్వాగతం పలుకుతున్న నాయకులు

మోతె, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూభారతి చట్టంపై నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మోతె మండలంలోని గోపతండా ఆవాసం గొల్లగూడెం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. భూభారతి చట్టంతో రైతులకు భూసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రెవెన్యూశాఖలో గ్రామ స్థాయిలో పనిచేసే ఉద్యోగులను త్వరలో కేటాయించడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూభారతి చట్టం అమలుకు ముందు కొన్ని మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమ లుచేశామన్నారు. గ్రామానికి వచ్చిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి మాజీ ఎంపీపీ ముప్పాని ఆశాశ్రీ కాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాణోత్ మాత్యనాయక్, సీనియర్ మండల నాయకుడు సామ వెంకట్ రెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొర్ర తిరుపతినాయక్, నవీన్ పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నేత రఘుపాల్ కన్నుమూత



5

● పార్థివ దేహం బీబీనగర్ ఎయిమ్స్‌కు అప్పగింత

పొంచిఉన్న తాగునీటి గండం?

● తగ్గుతున్న సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ● ఏకేబీఆర్‌లో 20రోజులకు సరిపడా నీరు నిల్వ ఉన్నాయంటున్న అధికారులు ● పుట్టంగండిలో అత్యవసర మోటర్ల ఏర్పాటుకు సన్నాహాలు

నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 512.7 అడుగులకు పడిపోయింది. దీంతో సాగర్, కృష్ణాజలాలపై ఆధారపడిన హైదరాబాద్ జంట నగరాలు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీటి గండం పొంచి ఉంది. నల్లగొండ జిల్లాకు 2.50 లక్షల హెక్టార్ల సాగునీరు, హైదరాబాద్ జంటనగరాలతో పాటు జిల్లాలోని 516గ్రామాలకు సాగునీరు ఏలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ద్వారా అందిస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం గణనీయంగా తగ్గుతోంది.

(ఆంధ్రజ్యోతి, పెద్దఅడిశర్లపల్లి)

ఎండలు మండుతుండడంతో ఏఎమ్మార్పీ అధికారులు తాగునీటికి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఏకేబీఆర్‌లో 20రోజులకు పైగా తాగునీరు అందించేందుకు నీటిని నిల్వ చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం 510అడుగులకు చేరితే ఏఎమ్మార్పీ మోటర్లు పనిచేయని పరిస్థితి. దీంతో నీటిపారుదల శాఖ. జలమండలి అధికారులు ప్రతి సంవత్సరం వేసవిలో అత్యవసర మోటర్లు బిగించి తాగునీటికి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఈ సంవత్సరం ప్రస్తుతం సాగర్





అత్యవసర మోటర్లు ఏర్పాటు చేసి కాలువ ద్వారా నీటి సరఫరా(ఫైల్)

ప్రాజెక్టులో నీటిమట్టం 512.7కు చేరుకుంది. సాగర్‌లో నీటిమట్టం తగ్గుతుండడంతో ఏఎమ్మార్పీ ద్వారా తాగునీటిని అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని వేలాది గ్రామాలకు తాగునీటిని అందించే సాగర్ అడుగంటు తుండడంతో ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రమాదకర స్థాయిలో డెడ్ స్టోరేజ్‌కి నీటి నిల్వలు పడిపోతుండడంతో డేంజర్ బెల్స్ మోగిస్తోంది.

మంచినీటి సరఫరాపై తీవ్ర ప్రభావం

నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 512.7అడుగులు మాత్రమే ఉంది. దీంతో హైదరాబాద్ జంట నగరాలకు ముందుముందు నీటిసరఫరా చేసేందుకు ఇబ్బంది కానుంది. 510 అడుగుల నీరు ఉంటేనే ఏఎమ్మార్పీ ఎత్తిపోతల ద్వారా హైదరాబాద్ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేయడం వీలవుతుంది. 510 అడుగుల కంటే తక్కువ ఉంటే నీటిని పంపింగ్ చేయడం సాధ్యం కాదు. పంపింగ్ కోసం అత్యవసర మోటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సాగర్ నీటినిల్వలు ఆందోళనకర రీతిలో తగ్గుతున్నాయి. రోజుకు దాదాపు ఒక టీఎంసీల నీటిని సాగర్ నుంచి వివిధ అవసరాలకు ఇరిగేషన్ అధికారులు వినియోగిస్తున్నారు. సాగర్ నీటి నిల్వలు తగ్గితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తీవ్ర ఇబ్బంది ఎదురయ్యే పరిస్థితి ఉందని, జంటనగరాలకు తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉంచాలని వాటర్‌బోర్డు అధికారులు ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. డెడ్‌స్టోరేజ్ 510 అడుగులకు చేరితే ఎమర్జెన్సీ పంపింగ్ చేయాల్సి వస్తుందని వాటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. సాగర్ వెనుక జలాలు అయిన ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నుంచి రోజుకు ఫేజ్-1,2,3 ద్వారా 525 క్యూసెక్కులు నీటిని తరలిస్తున్నారు. మిషన్ భగీరథకు 45క్యూసెక్కుల చొప్పున తరలిస్తూ సాగర్‌పై నున్న శ్రీశైలం ప్రాజెక్టు, జూరాల, ఆల్మట్టి ప్రాజెక్టులు నీరులేక విలవిల లాడుతున్నాయి. ఒకవేల వర్షాలు పడినా ఆ జలాశయాలు నిండిన తర్వాతే సాగర్‌కు రావాలి. వాడకం ఇలాగే కొనసాగితే మరో పది రోజుల్లో సాగర్‌నీటిమట్టం డెడ్ స్టోరేజ్ 510 అడుగులకు చేరుతుంది.

నీటి నిల్వలు తగ్గితే ఏర్పాట్లకు సిద్ధంగా ఉన్నాం

నాగార్జున సాగర్ నీటినిల్వలు ప్రస్తుతం 512.7అడుగల మేర ఉంది. ప్రస్తుతం ఏఎమ్మార్పీ ప్రాజెక్టు మోటర్ల ద్వారా అక్కంపల్లి రిజ్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి కోదండపురం వాటర్‌ప్లాంట్ ద్వారా జంట నగరాలకు తాగునీటిని తరలిస్తున్నాం. ప్రస్తుతం తాగునీటికి ఎలాంటి సమస్య లేదు. ఒకవేళ నీటి నిల్వలు తగ్గితే అత్యవసర మోటర్ల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం.

● వెంకటేశ్వర్‌రెడ్డి, వాటర్ బోర్డు డీఈ.

ఆటో డ్రైవర్ నిజాయితీ.. నగదు అప్పగింత

● ఆటోలో రూ.40వేల నగదు, పాస్‌పుస్తకాలు మర్చిపోయిన రైతు



రైతుకు నగదు అందజేస్తున్న ఆటో డ్రైవర్ భీంసింగ్‌నాయక్

దేవరకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. ఓ రైతు ఆటోలో మరిచిపోయిన రూ.40వేల నగదు, పాస్‌పుస్తకాలను తిరిగి రైతుకు అప్పగించాడు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మైనంపల్లి నుంచి దేవరకొండకు వెళుతున్న ఆటోలో అంబటోని గూడెం స్టేజీ వద్ద దయాకర్ అనే రైతు ఆదివారం ఆటో ఎక్కి దేవరకొండలో దిగాడు. దయాకర్ ఆటోలో రూ.40వేల నగదు, భూమి పాస్‌పుస్తకం ఉన్న కవరును మర్చిపోయాడు. గమనించిన ఆటో డ్రైవర్ కొర్ర భీంసింగ్‌నాయక్ ఆటోలో మర్చిపోయిన కవరును జాగ్రత్తగా భద్రపరిచాడు. వ్యవసాయ పాస్‌పుస్తకంపై దయాకర్ పేరు ఉండడంతో సమాచారం అందించాడు. అప్పటికే ఆందోళన చెందిన దయాకర్ ఆటో కోసం బస్టాండ్‌కు చేరుకొని విచారిస్తున్నాడు. ఆటోలో మర్చిపోయిన పాస్‌పుస్తకం, రూ.40వేల నగదును ఆటో డ్రైవర్ భీంసింగ్‌నాయక్ నిజాయితీగా దేవరకొండ బస్టాండ్‌లో ఆటో డ్రైవర్ల సమక్షంలో రైతు దయాకర్‌కు అందజేశాడు. ఆటోడ్రైవర్ భీంసింగ్‌ను రైతు దయాకర్ కృతజ్ఞతలు తెలుపగా, ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు అభినందించారు.

విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు మృతి



ఎడ్ల కళేబరాలు

నూతనకల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మేతకు వెళ్లిన రెండు ఎడ్లు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలంలోని యడవెల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మున్నా గంగమల్లు, బయ్య గంగయ్య తమ ఎడ్లను మేత కోసం వ్యవసాయ భూముల్లోకి తోలుకెళ్లారు. అక్కడ గంగమల్లుకు చెందిన ఒక ఎద్దు, గంగయ్యకు చెందిన ఒక ఎద్దు పొట్లాడుకున్నాయి. ఒకదానిని ఒకటి పొడుచుకుంటూ అక్కడే ఉన్న ట్రాన్స్ పార్మర్ వైర్లకు తాకడంతో విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన ఎడ్ల విలువ రూ.లక్ష ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

వడదెబ్బతో యువకుడు..



షేక్ ముజీబ్(ఫైల్)

పెన్‌పహాడ్, మే 18(ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ ముజీబ్(38) శుక్రవారం సూర్యాపేటలో జరిగిన సమావేశానికి వెళ్లి తిరిగి ఇంటికి రాగ ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఎండదెబ్బ తగిలి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఇంట్లో చికిత్సపొందుతుంగా పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

షార్ట్‌సర్క్యూట్‌తో గోల్డ్ వర్క్‌షాప్ దగ్ధం



దగ్ధమైన బంగారు ఆభరణాలు దుకాణం

మిర్యాలగూడ, మే 18(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో బంగారు ఆభరణాల తయారు చేసే దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. మారోజు కిరణ్‌కుమార్, మునగాల శ్రీనివాస్ స్థానిక పెద్దబజార్‌లో గోల్డ్ వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో దుకాణం నుంచి మంటలు వస్తుండగా గమనించిన స్థానికులు యజమానులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. కిరణ్‌కుమార్‌కు చెందిన రూ.5లక్షలు, శ్రీనివాస్‌కు చెందిన 5తులాల బంగారం దగ్గమయ్యాయి. దుకాణంలోని మిషన్లు కాలిపోయి రూ.7 లక్షల నష్టం వాటిల్లిందని యజమానులు తెలిపారు.

కొండమల్లేపల్లిలో వాహనాల తనిఖీ



వాహన పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు

కొండమల్లేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పశువుల సంత వద్ద ఇన్‌చార్జి ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి ఉపయోగపడే ఆవులు, ఎద్దులను కసాయికి విక్రయిస్తే పశువుల క్రయ విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుటామని హెచ్చరించారు.

థర్మల్ ప్లాంట్లకు వెదురు గుళికలు

(3వ పేజీ తరువాయి)

రాష్ట్రంలోని ఎనిమిది థర్మల్ పవర్ ప్లాంట్లకు చేరవేస్తారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. అదేవిధంగా గోదావరిఖని, కొత్తగూడెం, బెల్లంపల్లిలతోపాటు ఉత్తర తెలంగాణలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఈవెదురు గుళికలను సరఫరాచేసి పర్యావరణ కాలుష్యం తగ్గించడంకోసం కేంద్రం 60శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను జాతీయ వెదురు మిషన్ పథకానికి కేటాయించింది. ఇప్పటికే వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం తాజాగా వెదురు సాగును పెద్దఎత్తున విస్తరించడంకోసం ప్రణాళికతో ముందుకు సాగుతుంది. ఇందుకు త్వరలోనే మూడు జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు.

వెదురు సాగుతో రైతులకు ఆర్థిక ప్రయోజనం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో వెదురు సాగును పెద్ద ఎత్తున చేపట్టడానికి నిర్ణయించాం. ఇందులో భాగంగా వెదురు సాగును చేపడుతున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. థర్మల్ పవర్ ప్లాంట్లకు వెదురు గుళికలను సరఫరా చేస్తున్నందున మార్కెట్ పెరిగి రైతులకు ఆర్థికంగా ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీని ఇస్తూ ప్రోత్సాహం కలిపిస్తుంది. వెదురు సాగుపై రైతులకు సలహాలు, సూచనలతోపాటు వారికి అవగాహన కూడా కల్పించాలని నిర్ణయించాం.

పిన్నపురెడ్డి అనంతరెడ్డి, జిల్లా ఉద్యాన, హార్టికల్చర్ అధికారి, నల్లగొండ.

సుద్దాలలో మహిళ దారుణ హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న భువనగిరి డీసీపీ, జున్నుబాయి మృతదేహం



గుండాల, మే 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని సుద్దాల గ్రామంలో శనివారం అర్ధరాత్రి మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా లింగాల ఘనపురం మండలం ఏనబావి గ్రామపంచాయతీ పరిధిలోని పిట్టలవారిగూడేనికి చెందిన గుజులోతు చిన్న రాజయ్య నెల రోజుల క్రితం సుద్దాల గ్రామానికి చెందిన గూడ పృథ్వి మామిడితోటను లీజుకు తీసుకుని అక్కడే నివాసముంటున్నాడు. ఈ క్రమంలో అతని చిన్న అల్లుడు కాల్యా కనకయ్య శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి అత్తమామలతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో మాట మాట పెరగడంతో అక్క గుజులోతు జున్నుబాయిని(46) ఇనుప రాడ్డుతో తల మీద బలంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అడ్డొచ్చిన మామ గుజులోతు చిన్న రాజయ్య తలపై కూడా కొట్టడంతో అతను స్పృహ కోల్పోయాడు. రాజయ్య కూడా చనిపోయాడని భావించిన పృథ్వీ అక్కడి నుంచి పరారయ్యాడు. ఆదివారం ఉదయం గుజులోతు చిన్న రాజయ్య మేనల్లుడు కల్యా రాజు సంఘటనా స్థలానికి వచ్చే సరికి వీరు గాయపడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోవడంతో జున్నుబాయి అప్పటికే మృతిచెందగా, చిన్న రాజయ్య స్పృహ కోల్పోవడంతో అతనిని చికిత్స నిమిత్తం జనగాం ఏరియా ఆసుపత్రికి తరలించారు. భువనగిరి డీసీపీ అక్షాంశ్‌యాదవ్, సీఐ శంకర్‌గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జున్నుబాయి పెద్ద కుమార్తె పెంటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా



అర్జున్ మృతదేహాన్ని తీసుకొస్తున్న యువకులు



తిరుమలగిరి(సాగర్), మే 18(ఆంధ్రజ్యోతి): ఈత కోసం బావికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని పెద్ద బావితండాలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన జటావత్ సక్రు, సరోజల నాలుగో కుమారుడు జటావత్ అర్జున్(19) పదో తరగతి వరకు చదివి సొంత భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. తండ్రి జటావత్ సక్రుకు 15 ఎకరాల వ్యవసాయ పొలం ఉండడంతో మొదటి, రెండో భార్య కుమారులు ఐదుగురు తమ భూముల భాగం పంపిణీ కోసం వారం రోజులుగా భూమిని సర్వే చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం భూమి కొలవడం పూర్తికావడంతో తండ్రి సక్రు తన పెద్ద భార్య, ఇద్దరు కుమారులు శ్రీను, దారులతో కలిసి దామరచర్ల మండలంలోని కల్లేపల్లి జాతరకు వెళ్లారు. ఈ క్రమంలో సక్రు చిన్న భార్య కుమారులైన సునీల్, అర్జున్‌తోపాటు దారు కొడుకు ముగ్గురు కలిసి తమ వ్యవసాయ పొలంలోనే 20రోజుల క్రితం కొత్తగా తవ్వించిన బావి వద్దకు సాయంత్రం సుమారు మూడు గంటల సమయంలో ఈతకు వెళ్లారు. దీంతో అర్జున్ స్నానం చేసేందుకు ఒక్కసారిగా బావి లోపలికి వెళ్లడంతో ఈత సరిగా రాక నీటిలో మునిగిపోయాడు. ఎంతసేపటికీ అర్జున్ బయటకు రాకపోవడంతో భయాందోళనకు గురైన మిగితా ఇద్దరు కలిసి తండాకు వెళ్లి జరిగిన సంఘటన గురించి చెప్పారు. స్థానికులు బావి వద్దకు వచ్చి నీళ్లలో దూకి వెతకగా అర్జున్ మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. దీంతో కల్లేపల్లి జాతరకు వెళ్తున్న అర్జున్ తండ్రి, అన్నదమ్ముళ్లకు స్థానికుల నుంచి సమాచారం అందడంతో వారు తండాకు తిరిగిరాగా కుటుంబీకులు, బంధువుల ఆర్తనాదాల మధ్య తండాలోనే అంత్యక్రియలు నిర్వహించారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్టు

యాదగిరిగుట్ట రూరల్, మే 18,(ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక ఎస్ఐ. అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మహబూబ్‌పేట గ్రామ శివారు ప్రాంతంలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన గాజుల బాలకృష్ణ, గాజుల ప్రవీణ్, గాజులు సాయి గంజాయి సేవిస్తున్న పక్కా సమాచారం మేరకు సంఘటన వద్దకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 150 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి

● అర్హత లేని వైద్యుడి ఆపరేషన్ ● మెరుగైన చికిత్సకోసం హైద్రాబాద్‌కు తరలింపు ● చికిత్స పొందుతూ మృతి



అరుణ(ఫైల్)

సూర్యాపేటక్రైం, మే 18, (ఆంధ్రజ్యోతి): అర్హత లేని వైద్యుడు, అనుమతులు లేని ఆస్పత్రిలో మహిళకు ఆపరేషన్ చేయగా వైద్యం వికటించి మృతిచెందింది. ఈ సంఘటన ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పాలెల్లి వెంకటేశ్వర్లు కొంత కాలంగా సూర్యాపేటలోని నల్లాలబావి సెంటర్ సమీపంలో గల అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. సూర్యాపేటలో అరుణోదయ ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే అతడి భార్య అరుణ(38) అనారోగ్యానికి గురైంది. దీంతో 20 రోజుల క్రితం సూర్యాపేటలోని సాయిగణేష్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో అర్హత లేని వైద్యుడు అరుణను పరీక్షించి గర్భసంచి సమస్య ఉందని ఆపరేషన్ చేయాలని సూచించాడు. వైద్యుడి మాటలు నమ్మిన బాధితులు లాప్రోస్కోపిక్ ద్వారా ఆపరేషన్ చేయాలని కోరారు. దీంతో లాప్రో ద్వారా ఆమెకు ఆపరేషన్ చేశారు. ఆసమయంలో మృతురాలి గర్భసంచి తొలగించాల్సిన సమయంలో ఇతర ఆవయవాలను కూడా కట్ చేశారు. దీంతో తీవ్రమైన రక్తస్రావం జరిగి మృతురాలి పరిస్థితి విషమంగా మారింది. దీంతో వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి సంబంధిత సాయిగణేష్ ఆస్పత్రి యాజమాన్యం మెరుగైన చికిత్స కోసం పంపించింది. అక్కడ అరుణ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. అరుణకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సూసైడ్ నోట్ రాసి.. బావిలో దూకి

● వ్యవసాయ బావిలో దూకిన మహిళ ● వ్యవసాయ బావి పక్కన దొరికిన సూసైడ్ నోట్ ● లభించని మృతదేహం



సంధ్య(ఫైల్)

ఆత్మకూరు(ఎం) మే: 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో దూకిన మహిళ సంఘటన యాదాద్రి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రంలో ఆదివారం జరిగింది. ప్రత్యక్ష సాక్షి తోపాటు గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆత్మకూరు(ఎం) మండల మొరిపిరాల గ్రామానికి చెందిన కటికె సంధ్య(26) ఆదివారం మండల కేంద్రంలోని ఊరి దగ్గరలో ఉన్న వ్యవసాయ బావిలో దూకింది. దూకేటప్పుడు గట్టిగా రెండు మూడుసార్లు అరిచిందని, బావి నీటిలో నుంచి పెద్ద శబ్దం వచ్చిందని బావి పక్కన మామిడి చెట్టు కింద కాయల కాపల పడుకున్న తుమ్మల నర్సింహ చెప్పాడు. వెంటనే ఊర్లోకి వెళ్లి విషయం చెప్పారు. వారు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వ్యవసాయ బావి వద్ద పరిశీలించగా బావి ఒడ్డున చెప్పులు, కవరు దొరికింది. కవరులో మహిళ ఆధారుకార్డుతోపాటు సూసైడ్ నోట్ రాసి ఉంది. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

భార్యభర్తల మధ్య మనస్పర్థలు

మండలంలోని మొరిపిరాల గ్రామానికి చెందిన కటికె కృష్ణకు జనగామా జిల్లా రఘునాథ్‌పూర్‌మండలం కంచెనపల్లి గ్రామానికి చెంది సంధ్యతో గత సంవత్సర క్రితం వివాహమైంది. భార్యభర్తలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. కృష్ణ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నాడు. మూడుమాసాల పాటు అన్యోన్యంగా ఉన్న వీరిమధ్య మనస్పర్థలు వచ్చాయి. పంచాయితీ పెద్దమనుషుల వరకు వెళ్లింది. సంధ్య భర్తను వదిలి పుట్టింటికి వెళ్లింది. భర్త తనను ఇబ్బంది పెడుతున్నాడని సంధ్య రఘునాథ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కృష్ణ ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వీరి పంచాయితీ కొనసాగుతున్న నేపథ్యంలో సంధ్య ఆత్మకూరులోని వ్యవసాయ బావిలో దూకింది. సంఘటన స్థలానికి చేరుకున్న మోత్కూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

సూసైడ్ నోట్‌లో..

వ్యవసాయ బావిలో దూకిన సంధ్య సూసై డ్ నోట్ రాసింది. తన భర్త కృష్ణ, అత్తమామలు కటికె మారమ్మ, రాములు, తోపాటు శ్రీను, రమ్య, కలిసి ఆత్మకూరు పోలీస్టేషన్‌లో తనపై దొంగతనం కేసు పెట్టి ఇబ్బంది పెట్టారని పేర్కొంది. 'నేను దొంగతనం చేయలేదని చెప్పినా నాకు న్యాయం చేయాల్సిన ఆత్మకూరు(ఎం) పోలీసులు నా భర్త కృష్ణతో చేతులు కలిపి నా జీవితాన్ని నాశనం చేశారు. భర్త కృష్ణ, అత్తమామలు మారమ్మ, రాములు వారికి సహకరించిన వారందరికీ శిక్ష పడాలని కోరుకుంటున్నా' అని అని సంధ్య కాగితంపై రాసిపెట్టింది.

నిధులివ్వకుంటే కళాశాలలు బంద్

● ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.200కోట్ల పైమాటే

కోదాడ, మే 18(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాని పక్షంలో ఇంజనీరింగ్ కళాశాలల బంద్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బకాయిల విడుదల కోసం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హైదరాబాద్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. టోకెన్లు ఇచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్న, నిధులు విడుదల కాకపోవటంతో, రాష్ట్రస్థాయిలో అడహక్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఓ కళాశాల నిర్వహకులు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు కమిటీ కార్యచరణ సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ముందుగా ప్రభుత్వాన్ని నిధుల విడుదలకు విన్నవించాలని, ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకుంటే, డిగ్రీ కళాశాల మాదిరి ఆగస్టు నుంచి బంద్ బాట పట్టనున్నట్లు సమాచారం. కోట్లాది రూపాయల బకాయిలు రావాల్సి ఉందని, కళాశాలలు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు బకాయిల విడుదలకు టోకెన్లు జారీ చేసిందని, నేటికీ బకాయిలు విడుదల కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధ్యాపకులకు నెలనెలా జీతాలు ఇవ్వడం లేదని, ఈఎంఐలు, కరెంట్ బిల్లులు కట్టలేకపోతున్నామని, అటెండర్ల జీతాలు సైతం ఇవ్వలేక పోతున్నామని వాపోతున్నారు. ఒక్కో కళాశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా, రూ.12 నుంచి రూ.20కోట్ల బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు. వాటిలో ముందస్తుగా రూ.5 నుంచి రూ.10కోట్లు బకాయిలు, విడుదల చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. హైదరాబాద్‌లో చాల వరకు అటానమస్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలలో సీట్ల సంఖ్య ఎక్కువని, 30శాతం మేనేజ్‌మెంట్ కోటా ఉంటుంది. ఫలితంగా కోటా కింద వచ్చే నిధులతో వారు కళాశాలలను నిర్వహించడం సులభం. అదే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కళాశాలలో ఆ పరిస్థితి ఉండదు. ఆయా ప్రాంతాల్లో కళాశాలలు పూర్తిగా ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారపడి ఉంటాయి. ఫలితంగా నిధులు విడుదల చేయకపోతే, ఏలా నడపాలని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. బకాయిలు విడుదల చేయకపోవటంతో సర్టిఫికెట్స్ అందక విద్యార్థులు, ఉన్నత విద్యకు దూరం అవుతున్నట్లు చెబుతున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోకపోతే బంద్ బాట పట్టాల్సి వస్తుందని కళాశాల నిర్వాహకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన టోకెన్లకు డబ్బులు అందేలా చూడాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 16 ఇంజనీరింగ్ కళాశాల

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 16 ఇంజనీరింగ్ కళాశాలు ఉన్నాయి. నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ.200కోట్లు పైబడి రావాల్సి ఉంది. వీటికి ఏంబీఏ, ఏంసీఏ, ఫార్మసీ, బీఎడ్, పీజీ బకాయిలు అదనం. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి, టీబీఆర్‌లో బిల్‌లు అయ్యి, టోకెన్ల నెంబర్లు ఇచ్చారు. ప్రభుత్వం డీటీవో కార్యాలయాలకు డబ్బు జమ చేయకపోవడంతో నెలల గడుస్తున్నా టోకెన్లు పాస్ కావడంలేదు. ఫలితంగా డబ్బులు చేతికి రావటంలేదు. ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

తప్పని పరిస్థితిలో కమిటీ ఏర్పాటు

టోకెన్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవటంతోనే, రాష్ట్రస్థాయిలో అడహక్ కమిటీ ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం రాక ముందు, ఏ ఇబ్బందులు లేకుండా కళాశాలలను సాఫీగా నడపగలిగాం. ఒక నెల, రెండు నెలలు అంటే నడపగలం. సంవత్సరాలు కొద్దీ ఆదాయం రాకుండా ఎలా నడపాలో ప్రభుత్వం చెప్పాలి. విద్య, వైద్యానికి నిధులు లేకపోతే పనిచేయలేం. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి అధ్యాపకులు వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు, నెలవారీ ఈఎంఐలు చెల్లించే విధంగా చూడాలి. లేదంటే రాష్ట్ర అడహక్ కమిటీ తీసుకునే నిర్ణయం మేరకు కళాశాలల బంద్‌కు సిద్ధం కావాల్సి ఉంటుంది.

● ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులు

కిషోర్‌కుమార్‌కు అంబేడ్కర్ జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న కిషోర్‌కుమార్

నల్లగొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పల్లె కిషోర్‌కుమార్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. నల్లగొండ పట్టణానికి చెందిన కిషోర్‌కుమార్ సంగీత కళాకారుడిగా, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. తెలుగు నాటక రంగానికి అందిస్తున్న సేవలను గుర్తించిన సోషల్ వెల్ఫేర్ సొసైటీ అవార్డుకు ఎంపిక చేసింది. ఢిల్లీలో శనివారం జరిగిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చెన్నారావు, జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఎస్‌కె. రెహమాన్, న్యూఢిల్లీ ఇన్‌కంట్యాక్స్ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు నుంచి ఆయన అవార్డు అందుకున్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి



నల్లగొండ, స్పోర్ట్స్ మే 18(ఆంధ్రజ్యోతి): తైక్వాండో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించే విధంగా తయారు కావాలని తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. యూనుస్ కమాల్ అన్నారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని విన్నర్స్ వరల్డ్ తైక్వాండో అకాడమీలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కలర్ బెల్టుల ప్రమోషన్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కలర్ బెల్టల పోటీలో 120 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి ప్రమోషన్ పొందారు. చీఫ్ ఎగ్జామినర్స్‌గా మాస్టర్ జానకిరామ్, బి.శ్రీహరి, సురేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో మాస్టర్స్ అంబటి ప్రణీత్, నసిరుద్దీన్, సరయు, శ్రేష్ఠ పాల్గొన్నారు.

రాళ్లు జారిపడి.. కాల్వలు ధ్వంసమై

● శిథిలావస్థకు డిండి మెయిన్ కెనాల్ రివిట్‌మెంట్ ● దశాబ్దాలకుపైగా మరమ్మతులకు నోచని వైనం ● ఆధునికీకరణ పనులకు నోచని డిండి ప్రాజెక్టు


ప్రాజెక్టులోపల దెబ్బతిన్న రివిట్‌మెంట్

డిండి రిజర్వాయర్ మెయిన్ కెనాల్ రివిట్‌మెంట్‌తోపాటు బ్రాంచ్ కెనాల్స్ శిథిలావస్థకు చేరాయి. వర్షాధార మధ్యతరహా ప్రాజెక్టు అయిన డిండి రిజర్వాయర్‌ను అప్పటి నిజాం ప్రభుత్వం 1940 మార్చిలో ప్రారంభించి జూలై 1943లో పూర్తిచేసింది. నిత్యం కరువు కాటకాలకు లోనవుతున్న దేవరకొండ ప్రాంతంలోని ప్రజలకు వరప్రదాయినిగా ఉన్న ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైంది.

(ఆంధ్రజ్యోతి, డిండి)

నల్లగొండ జిల్లా డిండి, దేవరకొండ మండలాల్లో 12,500 ఎకరాలతోపాటు నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలంలోని 300ఎకరాలకు సాగునీరు అందిస్తున్న డిండి ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు నోచుకోలేదు. ప్రాజెక్టు మెయిన్ కెనాల్ 10.7కిలోమీటర్ల మేర రివిట్‌మెంట్ శిథిలావస్థకు చేరింది. రివిట్‌మెంట్ కోసం కాల్వకు ఇరువైపులా అమర్చిన గ్రానేట్ రాళ్లు నీటితాకిడికి కదిలి జారిపడ్డాయి. దీంతో మెయిన్ కెనాల్‌తో పాటు బ్రాంచ్ కెనాల్స్ కోతకు గురవుతున్నాయి. మెయిన్‌కెనాల్‌తోపాటు ఎనిమిది మైళ్ల పొడవు ఉన్న బ్రాంచ్ కెనాల్స్ కూడా దెబ్బతిన్నాయి. నార్త్ ఈస్ట్(ఎన్‌ఈ), నార్త్‌వెస్ట్(ఎన్‌డబ్ల్యూ) కాల్వలు మరమ్మతులకు నోచుకోలేదు.

పూడిక మేట వేయడంతో..

కొన్నిచోట్ల కాల్వల్లో పూడిక మేట వేయడంతోపాటు పిచ్చి మొక్కలతో నిండిపో యాయి. దీంతో కాల్వల్లో నీటి ప్రవాహానికి అడ్డుకట్టపడింది. కొన్ని డిస్ట్రిబ్యూటరీలకు తలుపులు లేకపోవడంతో నీటిని నియంత్రించడం అధికారులకు భారంగా మారింది. ఆరు సంవత్సరాలుగా వర్షపునీటికి కేఎల్ఐ(కల్వకుర్తి ఎత్తిపోతల) నీరు తోడవ్వడంతో ప్రాజెక్టు ఆయకట్టు సాగులోకి వచ్చింది. ప్రాజెక్టుకు ఉన్న మూడు హెడ్‌రెగ్యూలేటర్ (షటర్)లలో ఒకదాని నుంచి నీరు లీకేజీ అవుతుంది. షటర్లను కిందికి దింపినప్పటికీ నీరు లీకేజీ అవుతు డిండి వాగులో నీరు కలిసి వృథాగా పోతోంది. షటర్లు అమిరే గ్రూలో షటర్ సరిగా కూర్చేకపోవడంతోనే నీటి లీకేజీ అవుతున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.

మూడు నెలల్లో సర్వే పూర్తవుతుంది



డిండి ప్రాజెక్టు ఆధునికీకరణ సర్వే పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తాం. ప్రస్తుతం ఉన్న మెయిన్‌కెనాల్ క్యారియింగ్ కెపాసిటిని 300 క్యూసెక్కుల నుంచి 450 క్యూసెక్కులకు పెంచుతాం. ఎర్రారం నుంచి డిండి మెయిన్‌కెనాల్‌ను మరో 22 కిలోమీటర్ల దూరం పొడిగించి నేరేడుగొమ్ము, చందంపేట మండలాలలోని 18వేల ఎకరాలకు వరద రోజులలో(ఫ్లడ్ డేస్) సాగునీరు అందిస్తాం.

● అనిరుద్ కుమార్, జేఈ.


ధ్వంసమైన డిండి ప్రాజెక్టు మెయిన్ కాల్వ రాళ్లు

నీటి అలల తాకిడికి రిజర్వాయర్ రివిట్‌మెంట్ ధ్వంసం

ప్రాజెక్టు లోపలి భాగంలోని రివిట్‌మెంట్ అలలతాకిడికి దెబ్బతింది. మట్టికట్ట దెబ్బతినకుండా ఏర్పాటు చేసిన రివిట్‌మెంట్ ఎనిమిది దశాబ్దాలకుపైగా మరమ్మతులకు నోచుకోలేదు. రివిట్‌మెంట్‌పై మొలకెత్తిన మొక్కలు మానులయ్యాయి. దీంతో రివిట్‌మెంట్ పగుళ్లు తీసింది. అలల తాకిడికి మట్టకట్ట కోతకు లోనయ్యే ప్రమాదం ఉంది. ఎర్త్‌డ్యాం(మట్టికట్ట) పై నుంచి కిందికి వర్షపునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన షూట్లు దెబ్బతిన్నాయి. దీంతో షూట్ల నుంచి వెళ్లాల్సిన వర్షపునీరు కట్టపైనుంచి వెళ్లడంతో మట్టికట్ట కోతకు గురవుతోంది. కెనాల్స్‌తోపాటు డిండి ప్రాజెక్టును ఆధునికీకరించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మోతీరాంతండా వాసుల జల సంకల్పం

● గోదావరి జలాలతో మంగళచెరువును నింపే యత్నం ● రూ.11లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు ఏర్పాటు ● వారం నుంచి చెరువులోకి పారుతున్న గోదావరి జలాలు



మోడువారిన బీడు భూములకు కాల్వ నీళ్ల రావాలని ఆ గ్రామ రైతులు సంకల్పించారు. వరుణుడి కరుణమీదే ఎన్ని రోజులు ఆధారపడాలని యోచించుకున్నారు. తలాపున గోదావరి జలాలు పారుతుంటే తమ భూములు ఎందుకు బీళ్లుగా ఎందుకు ఉండాలని ప్రశ్నించుకున్నారు. గ్రామ రైతులు చేయిచేయి కలిపి గోదావరి జలాలతో చెరువును నింపాలని సంకల్పించుకున్నారు. 12మంది రైతుల ముందడుగుతో ఆ గ్రామ చెరువులోకి జలసిరి వడివడిగా వస్తోంది.

(ఆంధ్రజ్యోతి, తుర్కపల్లి)

తలాపునే గోదావరి జలాలు ప్రవహిస్తున్నా ఆ నీటిని వాడుకోలేని పరిస్థితి. వర్షాభావంతో ఈ ప్రాంతంలో పంట పొలాలు ప్రస్తుతం బీడు భూములను తలపిసున్నాయి. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రైతులు సమష్టి నిర్ణయం తీసుకున్నారు. బస్వాపూర్ ప్రాజెక్ట్‌కు వెళ్లే కాల్వలో విద్యుత్ మోటార్లు బిగించి ఆ నీటితో చెరువు నింపాలని భావించారు. అందుకుగాను ముందుగా 12మంది రైతులు ఒక్కొక్కరు రూ.80వేల చొప్పున డబ్బులు జమ చేసుకుని పనులకు శ్రీకారం చుట్టారు. తుర్కపల్లి మండలం మోతీరాంతండ పంచాయతీ పరిధిలోని మంగళ చెరువును గోదావరి జలాలతో నింపేందుకు మండలంలోని సంగ్యాతండా సమీపంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వ నుంచి సుమారు కిలోమీటరు దూరం వరకు డోజర్, ఎక్స్‌కవేటర్‌తో రూ.90 వేలతో కాల్వ తీశారు. ఆ కాల్వలో రూ.5.60 లక్షలు ఖర్చు పెట్టి పైపులైన్ ఏర్పాటు చేశారు. పైప్‌లైన్ జాయింట్ చేయడానికి మరో 50వేలు ఖర్చు చేశారు. ఈ పైప్‌లైన్‌కు రూ.2.70 లక్షలు ఖర్చు చేసి రెండు 20హెచ్‌పీ విద్యుత్ మోటర్లను కొనుగోలు చేసి ఆ మోటార్లకు పైపులు బిగించి, కాల్వలో వేశారు. ఈ విద్యుత్ మోటర్లు 24గంటల పాటు నిరంతరాయంగా నడిచేందుకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సహకారంతో పాటు ట్రాన్స్‌కో అధికారుల సూచన మేరకు ఆరుగురు రైతుల పేరుతో 6వేల రూపాయల చొప్పున ఆరు డీడీలు తీసి విద్యుత్ అధికారులకు ఇచ్చారు. దీంతో టాన్స్‌కో అధికారులు దిమ్మెలను నిర్మించి దానిపై రెండు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో మోటార్లు కాలువలోంచి నీటిని పంపింగ్ చేస్తున్నాయి. వారం రోజులుగా చెరువులోకి నీరు చేరుతుండడంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

మంగళచెరువు నిండితే..

మంగళచెరువు నిండితే భూ గర్భ జలాలు పెంపొండంతో మోతీరాం తండ, గోగుల గుట్టతండా, జాలు బావితండా, పర్రెబావితండా, బాబుల్ నాయక్‌తండా తదితర ప్రాంతాల రైతులకు సాగు, తాగు నీటి సమస్య తీరుతుందని రైతులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా 100 ఎకరాల వరకు రైతులు సాగు చేసుకునే అవకాశం ఉంటుందంటున్నారు. చెరువు పూడిక తీత మట్టిని విక్రయించి, విక్రయించి రూ.11లక్షలు జమ చేశారు. 12 మంది రైతులు ఎవరెవరు ఎంత ఖర్చు పెట్టారో లెక్క చూసుకుని ఆ డబ్బులను తీసుకున్నారు.

కాల్వల ద్వారా నీటిని నింపాలి



గత ప్రభుత్వ హయాంలో మెయిన్ కాలువల నిర్మాణం చేపట్టింది కానీ చెరువులు నింపడానికి అంతర్గత కాల్వల నిర్మాణం చేపట్ట లేదు. ప్రస్తుత ప్రభుత్వం మెయిన్ కాలువల నుంచి అంతర్గత కాలువల నిర్మాణం చేపట్టి ఆ కాల్వల ద్వార చెరువులను నింపాలని ప్రభుత్వాన్ని కోరారు.

● భానోత్ బిచ్చునాయక్, మాజీ సర్పంచ్, మోతీరాంతండా.

చెరువులోకి నీటిని వదలడం సంతోషంగా ఉంది



కరువు పరిస్థితుల కారణంగా గత ఖరీఫ్ సీజన్‌లో పంట వేయకుండా పొలం పడావుగా ఉంది. గ్రామస్థులు ముందుకు వచ్చి చెరువులోకి గోదావరి జలాలను తీసుకరావడం సంతోషంగా ఉంది. చెరువు నిండితే ఈ సారైనా పంటలు సాగు చేసుకోనే అవకాశముంటుంది. ప్రభుత్వం ప్రతీ ఏటా చెరువులోకి నీరు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలి.

● భానోత్ గున్నునాయక్, మోతీరాం నాయక్‌తండా.

కొండపోచమ్మ జీవధార..

కొండ పోచమ్మ ప్రాజెక్టు నుంచి వచ్చే తుర్కపల్లి (ఎం) కాలువ ద్వార మండలంలోని పలు గ్రామాల్లోని 20 చెరువులు, కుంటలు గోదావరి జలాలతో నిండడంతో ఈ గ్రామాల్లో రైతులకు సాగు నీటి సమస్య తీరింది. మండలంలోని కొండాపూర్, తిర్మలాపూర్, వీరారెడ్డిపల్లి, డీబీ తండ, ఇబ్రహీంపూర్, దత్తాయపల్లి, మోతీరాంతండ గ్రామాల్లోని చెరువులకు కాలువల ద్వార నేరుగా చెరువులోకి నీరు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని విద్యుత్ మోటర్ల ద్వారా గోదావరి జలాలతో చెరువులు నింపుతున్నారు.


కాల్వలో వేసిన విద్యుత్ మోటర్లు

సీపీఎం సీనియర్ నేత రఘుపాల్ కన్నుమూత

● పార్థీవ దేహం బీబీనగర్ ఎయిమ్స్‌కు అప్పగింత
● సీపీఎం హైదరాబాద్ నగర కార్యదర్శిగా మూడు పర్యాయాలు బాధ్యతలు


రఘుపాల్ పార్థీవదేహాన్ని ఎయిమ్స్‌కు అప్పగిస్తున్న బీవీ రాఘవులు, కుటుంబ సభ్యులు

బీబీనగర్, రాజాపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నేత, అఖిల భారత శాంతి సంఘీభావ సమితి జాతీయ నాయకుడు గంగసాని రఘుపాల్ (83) ఆదివారం మృతిచెందారు. ఆయన తండ్రి గంగసాని గోపాల్‌రెడ్డి (గబ్బెట గోపాల్‌రెడ్డి) 1957వ సంవత్సరంలో పీడీఎఫ్ (ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ)నుంచి జనగామ ఎమ్మెల్యేగా ఉన్నారు. 1942 మే 22న జన్మించిన రఘుపాల్ బీఎస్సీ, ఎల్ఎల్‌బీ చదివారు. 1964 నుంచి సీపీఎంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 15 సంవత్సరాలు హైదరాబాద్ నగర కార్యదర్శిగా వ్యవహరించారు. ప్రస్తుతం సీపీఎం అఖిల భారత శాంతి సంఘీభావ సమితి జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. రఘుపాల్ మృతికి గ్రామ, మండల అఖిల పక్ష నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. రఘుపాల్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

భౌతిక కాయం బీబీనగర్ ఎయిమ్స్‌కు అప్పగింత

తన పార్థీవ దేహాన్ని ఏదైనా మెడికల్ కళాశాలకు పరిశోధనల నిమిత్తం అప్పగించాలనే రఘుపాల్ కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన పార్థీవ దేహాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని ఎయిమ్స్ మెడికల్ కళాశాలకు అప్పగించారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు సమక్షంలో బీబీనగర్‌లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ మెడికల్ కళాశాలకు పరిశోధనల నిమిత్తం ఆదివారం అప్పగించారు.

చిన్నతనంనుంచే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడు : బీవీ రాఘవులు

చిన్నప్పటి నుంచే కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడైన నేత రఘుపాల్ జీవితం ఆదర్శనీయమని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. రఘుపాల్ భూస్వాముల కుటుంబంలో పుట్టినా అగ్ర కులానికి చెందిన వ్యక్తే అయినప్పటికీ ఆయన ఏనాడూ కులభావజాలం జోలికి పోలేదన్నారు. నిత్యం పార్టీ కోసం ప్రజాసమస్యలపైనే పోరాటం చేసేవారని చెప్పారు. ఆయన నిరాడంబరమైన జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, సీపీఎం హైదరాబాద్ నగర కార్యదర్శిగా మూడు పర్యాయాలు బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట సీపీఎం రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, కనకారెడ్డి, రాములు, చంద్రారెడ్డి, కల్లూరి మల్లేశ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సోమయ్య, నర్సింహ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న వారికి మార్కెట్ ధర చెల్లించాలి

హుజూర్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగడ్డ గ్రామంలో వ్యవసాయ యూనివర్సిటీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మట్టిపల్లి సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం బూరుగడ్డలో పంట పొలాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. వ్యవసాయ భూముల సేకరణపై ప్రభుత్వం వెంటనే గ్రామసభ ఏర్పాటు చేయాలన్నారు.వ్యవసాయ భూముల సేకరణపై ప్రభుత్వం వెంటనే గ్రామసభ నిర్వహించాలన్నారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లుగా పేదలు ఈ భూములు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. మీగడ రాములు, ఆవుల సైదులు, గురవయ్య, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

భక్తజన సంద్రం..యాదగిరిక్షేత్రం

● **నిత్య ఆదాయం రూ. 63.93 లక్షలు**

యాదగిరిగుట్ట, మే 18 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆదివారం భక్తజనసంద్రమైంది. వేసవి సెలవులు...వారాంతపు సెలవు కలిసి రావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో నిండిపోయి వైకుంఠద్వారం ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేశారు. పార్కింగ్ స్థలం నిండిపోయిందని, దర్శనం పూర్తయిన వాహనంలో వచ్చిన భక్తులు కొండకిందకు వెళ్లాల్సిందిగా ఆలయ అధికారులు మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. కొండకింద టోల్‌గేట్ వద్ద వాహనాలు బారులు తీరాయి. తలనీలాలు సమర్పించిన భక్తులు సత్యదేవుని వ్రతాలు, నిత్య కల్యాణోత్సవాలతో అధిక సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. కొండకింద ఆధ్యాత్మిక వాడల్లో లక్ష్మీ పుష్కరిణి, అన్నదాన సత్రం, ఆర్టీసీ బస్టాండ్ తదితరాలు సందడిగా మారాయి. బస్టాండ్‌లోకి బస్సులు రాగానే గుంపుల పరుగులు ఆలస్యంగా వచ్చిన బస్సులో ఎక్కేందుకు భక్తులు పోటీపడ్డారు. ఎస్పీఎఫ్ సిబ్బంది వారిని అదుపు చేయలేకపోయారు. కొండపైన ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వాహనాలు పార్కింగ్ చేయడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. సుమారు 60 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి వచ్చిన ప్రత్యేక, ఉచిత ధర్మదర్శన క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీగా మారాయి. ప్రత్యేక దర్శనాలకు రెండు గంటలు, ధర్మదర్శనాలకు నాలుగు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. తిరువీధుల్లో ఏర్పాటు చేసినా నీటి కుళాయిల వద్ద దాహం తీర్చుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఎండ వేడిమికి కొండ బండ కాలుతుండటంతో రక్షణగా అధికారులు ఎర్రటి తివాచీలు ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 63,93, 991ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.


యాదగిరిగుట్ట: ఉచిత దర్శన క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు


సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

ప్రత్యేక దర్శన క్యూలైన్‌లో ఉక్కపోత

బ్రేక్ దర్శన వేళల్లో రూ. 150 ప్రత్యేక టికెట్లు పొందిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం, సాయంత్రం కలిపి రెండు గంటల సమయం ప్రత్యేక దర్శన క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు ఎండ వేడిమికి తట్టుకోలేకపోవడమే కాక భక్తులకు దాహం వేయగా ఉక్కపోతకు తడిసిపోయారు. తూర్పు రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్‌లో కూలర్లు, ఫ్యాన్లు లేకపోవడం చేత చంటి పిల్లల తల్లులు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడ్డారు. కనీసం వేసవి దృష్ట్యా చలువ పందిళ్లు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారలను మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాత గుట్ట స్వామిఅమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

స్వామిని సేవలో స.హ చట్టం కమిషనర్ శ్రీనివాస్‌రావు

సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన పీ.వీ.శ్రీనివాస్‌రావు కుటుంబ సమేతంగా తొలిసారి అంతరాయంలోని స్వయంభువులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు. ముందుగా ప్రోటోకాల్ కార్యాలయం వద్ద కలెక్టర్ ఎం. హనుమంతరావు, భువనగిరి ఆర్డీవో క్రిష్ణారెడ్డి మొక్కలతో స్వాగతం పలికారు. ఆయన వెంట తహసీల్దార్ దేశ్యానాయక్, పట్టణ పోలీసు ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్, ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రమేషబాబు, పర్యవేక్షకులు వాసం వెంకటేశ్వర్లు, మాచర్ల రాజన్‌బాబు, నాగుల మహేష్, దీరావత్ రామరావునాయక్, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు ఉన్నారు.

మట్టపల్లిలో నృసింహుని కల్యాణం

మఠంపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండవ యాదగిరిగుట్టగా పేరొందుతున్న సూర్యాపేట జిల్లా మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో ఆదివారం స్వామివారి నిత్య కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమా ర్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, రాజష్, రమేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


మట్టపల్లి: తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శాలిగౌరారం, మే 18 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో భైరవునిబండ, వంగమర్తి, వల్లాల 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ శ్రీధర్ తెలిపారు. సోమవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ శ్రీధర్ కోరారు.

బస్సులను అడ్డగించిన అధికారులు

చిట్యాల, మే18, (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్ నుంచి చిట్యాల వరకు నడుస్తున్న పటేల్ బస్సులను ఆదివారం నల్లగొండ రీజియన్ ఆర్టీసీ అధికారులు అడ్డుకున్నారు. సుమారు రెండు గంటలు స్థానిక బస్టాండ్‌లో నిలిపివేశారు. విషయం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల దేవదాస్ ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లగా ఆయన నల్లగొండ రీజియన్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సులను యథాతథంగా నడవనీయాలని ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

● *ఎమ్మెల్యే వేముల వీరేశం*

కట్టంగూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఈదులూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన గంగభవాని అమ్మవారి పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలు దైవచింతన కలిగి ఉండి భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వీరేశంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, మాజీ సర్పంచ్ అయితగోని నారాయణ, మాజీ ఎంపీటీసీ చింత వెంకటనర్సయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కట్టంగూరు: విద్యుత్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మే డే ఉత్సవాల్లో భాగంగా కట్టంగూరు సబ్‌స్టేషన్ వద్ద ఐఎన్‌టీయూసీ-327 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీరేశంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కోమటిరెడ్డి సమిరెడ్డి, గుగులోతు పాండు, సమ్మెట వెంకన్న, రవికుమార్, నాయకులు బుచ్చాల వెంకన్న, సోమగాని రామకృష్ణ, ఈశ్వరమ్మ, ఝాన్సీ, పద్మ, శోభరాణి, శ్రీను పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

నల్లగొండరూరల్, మునుగోడురూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యుడిగా మునుగోడు మండల ఎలుగలగూడెం గ్రామానికి చెందిన తీ ర్పారి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి పట్టణంలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 600 ప్రతినిధులతో నాలుగు రోజుల పాటు సుదీర్ఘ చర్చల అనంతరం నూతన కౌన్సిల్ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు జాతీయ కమిటీలో అవకాశం లభించింది. ఇందులో భాగంగా జిల్లా ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తీర్పారి వెంకటేశ్వర్లును జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

సమాఖ్య అటెండర్ వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్యలో అటెండర్‌గా పనిచేస్తున్న వారి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య అటెండర్ల సంఘం జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సమాఖ్య ఏర్పడిన 20 ఏళ్ల నుంచి తక్కువ వేతనానికి పనిచేస్తున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడంతో ప్రతీ నెలా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వారికి వెంటనే గుర్తింపు కార్డులు, పీఏ ఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభు త్వం స్పందించని యెడల వారితో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, సైదులు, సైదమ్మ పాల్గొన్నారు.

కనగల్‌లో లింగమంతుల జాతర ప్రారంభం



జోగు వేడుకలో పాల్గొన్న యాదవ కులపెద్దలు

కనగల్, మే 18(ఆంధ్రజ్యోతి): యాదవుల కుల దైవం లింగమంతులస్వామి, గంగదేవమ్మ తల్లి జాతర వేడుకలు 12 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం కనగల్‌లో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతరలో భాగంగా గ్రామశివారులోని లింగమంతులస్వామి, గంగదేవమ్మతల్లి ఆలయాలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లం పానకంతో పొత్తు పోశారు. వరద పాశం వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు కనగల్ గ్రామంలో యాదవ కులపెద్దలు జో గు కార్యక్రమాన్ని సంప్రదాయ పద్ధతిలో చేపట్టారు. జూన్ 1, 2వ తేదీల్లో పెద్ద పం డుగ ఉంటుందని కుల పెద్దలు తెలిపారు.

విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

● *మండల వ్యవసాయాధికారి గిరిప్రసాద్*

కట్టంగూరు, మే 18(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కట్టంగూరు, ఈదులూరు ఆగ్రో రైతు సేవా కేంద్రాలలో రాయితీపై విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ వాడటం వల్ల భూసారం పెరిగి పంటలకు అధిక లాభాలు చేకూరుతాయన్నారు. 50శాతం రాయితీపై విత్తనాలు అందిస్తున్నామని, ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు, భూమి పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ ఖాతా జీరాక్స్ తీసుకవచ్చి విత్తనాలను తీసుకోవాలని కోరారు.

మధుసూదన్‌రెడ్డికి కృష్ణారెడ్డి నివాళి



మధుసూదన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి

మునుగోడు, మునుగోడురూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెదిరె మధుసూదన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి టీపీసీసీ నాయకు డు చలమల్ల కృష్ణారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పున్న కైలాస్ నేత సంతాపం ప్రకటించారు. ఆదివారం కొంపల్లి గ్రామంలోని స్వగృహంలో బాధిత కుటుంబ సభ్యులైన వెదిరే పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిరె మేఘారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డిని వారు వేర్వేరుగా కలిసి పరామర్శించారు. మధుసూదన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారివెంట కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహగౌడ్, లింగంముదిరాజ్, వెంకన్నగౌడ్ ఉన్నారు.

డిజిటల్ ఇంటి నంబర్లెక్కడ?

- *నెంబర్ల పేరిట రూ. 1.5 కోట్లు వృథా*
- *పూర్తి చేయకుండానే చేతులెత్తేసిన కాంట్రాక్టు సంస్థ*
- *అరకొరగా వివరాలు సేకరించి నివేదిక అందజేత*
- *నిధులు ఖర్చయినా ప్రయోజనం శూన్యం*

(రామగిరి, ఆంధ్రజ్యోతి)

నల్లగొండమునిసిపల్ పరిధిలో ఇంటి నెంబర్లు గందరగోళంగా మారాయి. పట్టణంలో ఒక్కో ఇంటికి రెండేసి నెంబర్లు, కూలిపోయిన ఇళ్లకు కూడా నెంబర్లు ఉండటం వంటి కారణాలతో ఆస్తి పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఆస్తిపన్నులో తేడాలు తదితర వాటికి స్వస్తి చెప్పాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా ఇంటి నెంబర్ చూడగానే పూర్తి వివరాలు తెలిసేలా డిజిటల్ డోర్ నెంబర్ విధానానికి అప్పటి అధికారులు, పాలకులు డిజిటల్ సర్వేకు శ్రీకారం చుట్టారు. నీలగిరిలో ఉన్న ప్రతీ ఇంటికి డిజిటల్ నెంబర్ ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో అధికారులు, పాలకవర్గం ఓ కాంట్రాక్టు సంస్థకు సర్వే బాధ్యతలు అప్పగించింది. అయితే కాంట్రాక్టు దక్కించుకున్న సదరు సంస్థ అసంపూర్తిగా సర్వే చేసి చేతులు దులుపుకుంది. దీంతో లక్ష్యం పూర్తిగా నీరుగారిపోయింది. ఒప్పంద ఏజెన్సీ సంస్థ డిజిటల్ సర్వే పూర్తి చేయక ముందే 90 శాతం డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నల్లగొండ పట్టణం (ఫైల్)

ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నాం



డిజిటల్ డోర్ నెంబర్ల సర్వే ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. రిపోర్టును పెన్‌డ్రైవ్‌లో అందించారు. ఈ నెంబర్ల ప్రక్రియ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురుచుస్తున్నాం . గతానికి పోల్చి చూసుకుంటే సర్వే ద్వారా 2వేల ఇళ్ల వరకు పెరిగాయి. ఆస్తి పన్ను ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

రెండేళ్లు దాటినా...

నీలగిరిలో చేపట్టిన డిజిటల్ డోర్ నెంబర్ల సర్వే రెండేళ్లు దాటినా నేటికి పూర్తి కాలేదు. పట్టణంలోని 48 వార్డుల్లో సర్వే దాదాపు 80 శాతం పూర్తి అయినట్లు చెబుతున్నా అంతా అసంపూర్తిగానే వదిలేసినట్లు తెలిసింది. జిల్లాలోని నీలగిరి, మిర్యాలగూడ తదితర ప్రధాన పట్టణాల్లో డిజిటల్ డోర్ నెంబర్లు ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. దీంట్లో భాగంగా నీలగిరిలో సర్వే చేపట్టింది. గత ఎన్నికలకు ముందే సర్వే నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో నీలగిరిలో కాంట్రాక్టు పొందిన ఏజెన్సీ సంస్థ సర్వేను అర్థాంతరంగా నిలిపివేసింది. అయితే ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడటం, మునిసిపల్ అధికారులు బదిలీలు కావడంతో ఏజెన్సీ సంస్థ సర్వేను అటకెక్కించింది.

నిబంధనలకు విరుద్ధంగా సర్వే

కచ్చితత్వంతో పారదర్శకంగా డిజిటల్ డోర్ నంబర్ సర్వే చేస్తే దాదాపు 90 శాతం వాణిజ్య, ఫంక్షన్ హాళ్లు, ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రైవేట్ విద్యాసంస్థల భవనాల నుంచి ఆస్తి పన్ను పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇంటి అనుమతి తీసుకోకుండా భవనాలు నిర్మించుకున్న వారితోపాటు, అనుమతి ఒక అంతస్తుకు తీసుకొని మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మించడం, ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని వాణిజ్య భవనాలు నిర్మించడం లాంటివి పట్టణాల్లో వందల సంఖ్యలో ఉన్నాయి. ఇలాంటి భవనాలకు మునిసిపల్ చట్టం ప్రకారం విధించే పన్నుకు రెట్టింపు వేయాల్సి ఉంటుంది. డిజిటల్ డోర్ నెంబర్ సర్వే పూర్తి చేస్తే మునిసిపాలిటీలకు 80 నుండి 90 శాతం వరకు భవనాల ఆస్తి పన్ను పెరిగే అవకాశం ఉండేది. అయితే ఇలాంటి వాటి విషయంలో సర్వే సంస్థ కచ్చితత్వంతో పనిచేయకుండా నిబంధనలలకు విరుద్ధంగా వ్యవహరించి మునిసిపల్ అధికారులను, ప్రజాప్రతినిధులను సైతం పక్కదారి పట్టించి మమ అనిపించిందనే ఆరోపణలు ఉన్నాయి. సర్వే పూర్తి చేయని ఏజెన్సీ సంస్థకు ప్రస్తుత మునిసిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి మరోసారి సర్వే చేయిస్తారా లేక మిన్నకుండిపోతారా అనేది ప్రశ్నార్థకంగా ఉంది.

పట్టణం వివరాలు

నీలగిరిలో వార్డుల సంఖ్య	- 48
నివాస భవనాలు	- 36,750
వాణిజ్య భవనాలు	- 2,510
నివాస, వాణిజ్య భవనాలు	- 3,550
మొత్తం భవనాలు	- 42,810
ప్రస్తుతం వసూలవుతున్న ఆస్తిపన్ను	- రూ.17 కోట్లు
సర్వేకు నిధుల కేటాయింపు	- రూ. 1.50కోట్లు
పూర్తయిన సర్వే (అంచనా)	- 80 శాతం

రూ.150 కోట్ల నిధులు వృథా!

మునిసిపాటిలో అధికారులను ఇంటి నంబర్ల సమస్య వెంటాడుతోంది. కొన్నిచోట్ల డబుల్ ఇంటి నెంబర్ల సమస్య ఉంది. ఇళ్ల యజమానులు పేర్ల, ఇంటి నంబర్లు తప్పుగా నమోదు కావడంతో పాటు కానీ ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో కాంట్రాక్టు సంస్థలు సర్వే పూర్తి చేయలేకపోయాయి. ఒక్క నీలగిరి మునిసిపాలిటీలోనే డిజిటల్ డోర్ నెంబర్ సర్వే చేయడానికి రూ.1.50 కోట్లు వెచ్చించినా ఏజెన్సీ సంస్థ చేసిన తప్పిదానికి నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోలు

- *5 లక్షల క్వింటాళ్ల పైబడి సేకరణ*
- *కనగల్‌లో కొనసాగుతున్న కొనుగోళ్లు*



లారీలకు ధాన్యం ఎత్తుతున్న హమాలీలు

కనగల్, మే 18 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ వరి పంట కొనుగోలు చేసేందుకు అధికారులు మండలంలోని వివిధ గ్రామాల్లో 25 ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు జరిగింది. గత సీజన్‌లో మండలవ్యాప్తంగా సుమారు 3 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం 6,443 మంది రైతుల నుంచి 5.24 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకు సం బంధించి రూ. 121 కోట్లకు గాను రైతుల ఖాతాల్లో ఇప్పటి వర కు రూ. 105 కోట్లు జమ చేశారు. ఇదిలా ఉంటే పీఏసీఎస్ తరఫున రెండు ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయగా సుమారు లక్ష క్వింటా ళ్ల ధాన్యం సేకరించినట్లు సబంధిత అధికారులు తెలిపారు. కొనుగోలు పూర్తి అయిన 17 ఐకేపీ సెంటర్లను మూసివేయగా మరో 8 కేంద్రాలు కొనసాగుతున్నాయి.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



మండలవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 25 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను 17 సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. మరో 8 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతు న్నాయి. అదనపు లారీలు ఏర్పాటు చేసి ధాన్యం ఎగుమతులను వేగవంతం చేశాం. ముందస్తు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మరో నాలుగైదు రోజుల్లోనే ధాన్య కొనుగోలు పూర్తి చేస్తాం.

● హరి, ఏపీఎం, కనగల్



సెల్ మాట్లాడుతూ మరో బైక్‌ను కాలుతో నెడుతూ తీసుకెళ్తున్న యువకుడు

ఫోన్ 'కాల్' అవసరమా?

తప్పు మీద తప్పు... సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైక్ నడపడమే ప్రమాదకరం. కానీ నల్లగొండలో ఓ యువకుడు తన స్నేహితుడి బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో కాలుతో నెడుతూ తీసుకెళ్తున్నాడు. చేసేది సాయమే కావచ్చు కానీ సెల్ మాట్లాడుతూ బైక్ నడుపుతూ మరో బైక్‌ను నెడుతూ తీసుకెళ్లడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఈ సమయంలో ఫోన్ కాల్ అవసరమా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయరూ

● *ఈదురు గాలులకు 15 రోజుల క్రితం కూలిన స్తంభాలు* ● *పట్టించుకోని విద్యుత్ అధికారులు*

(ఆంధ్రజ్యోతి- నల్లగొండ రూరల్):


మండలంలోని రసూల్‌పురం గ్రామంలో 15 రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు గ్రామంలోని గుండెబోయిన జానయ్యకు చెందిన పొలం వద్ద ఓ స్తంభం విరగగా, మరో స్తంభం వరిగింది. తీగలు తెగి పడ్డాయి. దీంతో మరుసటి రోజు విషయాన్ని గమనించిన గొర్రె కాపర్లు తీగలు తెగి పడిపోయి ఉండటం చూసి రైతుల జానయ్య యాదవ్‌కు తెలిపారు. ఆయన వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో లైన్‌మన్, హెల్పర్ వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ వద్దవిద్యుత్ సరఫరా కాకుండా ఫ్యూజ్ తొల గిం చారు. కానీ నేలపై తెగిపడి ఉన్న తీగలకు విద్యుత్ సరఫరా కాకుండా కనెక్షన్ కట్ చేయకుండా వెళ్లి పోయారు. అనంతరం స్థానిక రైతులు గమనించి తిరిగి లైన్‌మన్‌కి సమాచారం ఇవ్వడంతో నేలపైన ఉన్న తీగలకు కనెక్షన్ కట్ చేశాడు. కాగా విరిగిన స్తంభాల ప్రాంతంలో కొత్త స్తం భాలు ఏర్పాటు చేయాలని రైతులు ఏఈ రవీందర్‌రెడ్డి కోరారు. దీంతో ఆయన మరసటి రోజు వెళ్లి స్తంభాలు తెచ్చుకోవాలని రైతులకు సూచించారు. అప్పటి నుంచి రైతులు ఏఈకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు పేర్కొన్నారు. అయితే మరో 10 రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. రైతులు సాగు పనులు ప్రారంభిస్తే స్తంభాలు వేయడం రాదని, సాగు వెనక్కి అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈ విషయంపై ఏఈ రవీందర్‌రెడ్డికి ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా కాల్‌డైవర్ట్ అని వస్తోంది. పలు మార్లు చేస్తే ఫోన్ పని చేయడం లేదని వస్తోంది.



రసూల్‌పురలో కూలిన విద్యుత్ స్తంభం

ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు



15 రోజుల క్రితం గాలి వానకు తీగలు తెగి, స్తంభాలు కూలిపోతే ఏఈకి ఫోన్ చేస్తే స్పందించడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. కొత్త స్తంభాలు ఏర్పాటు చేయకుండా పొలం దున్నితే కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడం కుదరదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలి.

- గుండెబోయిన జానయ్య, రసూల్‌పురం, రైతు

రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

కేతేపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 20నుంచి 24వ వరకు ఐదు రోజుల శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంఈవో ఆకవరపు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో భాగంగా ఉపాధ్యాయులకు వివిధ స్థాయిల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఇందులో భా గంగా మండల స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ చేపట్టామని చెప్పారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నకిరేకల్ పట్టణంలోని జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజూఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగే ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం



సైదమ్మకు డబ్బులు అందిస్తున్న అందజేస్తున్న స్నేహితులు

నార్కట్‌పల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి చెందిన బొప్పని మారయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మారయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు అతడితో పాటు 2005-06లో పదోతరగతి చదువుతున్న స్నేహితులు రూ.20వేలు సేకరించి మారయ్య కుమార్తె సైదమ్మ ఆదివారం అందించారు. కార్యక్రమంలో బి.స్వామిగౌడ్, రామోజు నాగాచారి, బింగి శ్రీనివాస్, ఎన్.శంకర్, పి.శేఖర్, ఆర్.శ్రవణ్, ఎస్.శ్రీనివాస్, పి.శివశంకర్, శ్రవణ్ పాల్గొన్నారు.

చెన్నారెడ్డికి ఎమ్మెల్సీ సత్యం పరామర్శ



చెన్నారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు, మే 18 (ఆంధ్రజ్యోతి): చండూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై మోకాలి ఆపరేషన్ చేయించుకొని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆదివారం కలిసి పరామర్శించారు. ఈసందర్భంగా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, మాజీ జడ్పీటీసీ లింగయ్య, మాజీ సర్పంచి పాల్వాయి లక్ష్మీ, లక్ష్మారెడ్డి, కైలాసం, కొమ్ము మల్లేష్ ఉన్నారు.


పెద్దగోని యాదయ్య సేవలు మరువలేనివి

గట్టుప్పల్, మే 18 (ఆంధ్రజ్యోతి): సీపీఐకి పెద్దగోని యాదయ్య సేవలు మరువలేనివని అని ఆ పార్టీ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్ అన్నారు. ఆదివారం ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన యాదయ్య సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యాదయ్య అనేక ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొని ఎర్రజెండా నినాదాన్ని ముందుకు తీసుకెళ్లిన గొప్ప నాయకుడు అన్నారు. కార్యక్రమంలో కళాకారుల ఆటపాట అందరిని ఆకట్టుకన్నాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ గట్టుప్పల్ పట్టణ కార్యదర్శి కారింగు శ్రీను, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బుడిగెపాక జగన్, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు దొంతగాని పెద్దులు, బీమగాని రణదీప్, కానుగుల మహేష్, కాటపాక శంకర్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



యాదయ్య చిత్రపటానికి వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
3
సోమవారం 19 మే 2025



చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	23.4

పొంచి ఉన్న తాగునీటి గండం?

● తగ్గుతున్న సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 512.7 అడుగులకు పడిపోయింది. దీంతో సాగర్, కృష్ణాజలాలపై ఆధారపడిన హైదరాబాద్ జంట నగరాలు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీటి గండం పొంచి ఉంది. 4

యుద్ధప్రాతిపదికన పనులు చేయాలి

● నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ అసంతృప్తి



జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు, మే 18 (ఆంధ్రజ్యోతి) : బేటీతండా, జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని ఎత్తిపోతల పథకాలను ఆయన పరిశీలించారు. రూ.34 కోట్లతో చేపట్టిన బేటీతండా ఎత్తిపోతల పథకం ద్వారా 2,041 ఎకరాలు సాగు చేయవచ్చని సుమారు 2,176 మంది రైతులు లబ్ధిపొందుతారన్నారు. బేటీతండా పథకం ద్వారా 90శాతం మంది బెట్టెతండా గిరిజనులకు లబ్ధిచేకూరుతుందన్నారు. అనంతరం జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. పనుల తీరును చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకానికి నిధులు మంజూరు చేయించానని, పనులు మాత్రం జరగడం లేదన్నారు. నవంబరులోగా పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను, అధికారులకు ఆదేశించారు. భూసేకరణ కోసం కలెక్టర్‌కు రూ.2.59 కోట్లు నిధులు అం దించినట్లు తెలిపారు. పథకం ద్వారా పాలకవీడు మండలంలోని కోమటికుంట, జాన్‌పహాడ్, చెర్వుతండా, గుండ్లపహాడ్, గుండెబోయినగూడెం, అలింగాపురం, బొత్తలపాలెం, రాఘవాపురం, మీగడంపాడుతండాలకు సాగునీరు అందుతుందన్నారు. సుమారు 5,650 ఎకరాలకు సాగునీరందుతుందని, సుమారు 7వేల మంది రైతులకు లబ్ధిచేకూరుతుందన్నారు. ఈ పథకం ద్వారా ఇంకా కొన్ని గ్రామాలకు సాగు నీరందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎన్నెస్పీ సీఈ రమేష్ బాబు, భూక్యా గోపాల్, మోతీలాల్, సుబ్బారావు, నర్సింహారావు పాల్గొన్నారు.

థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు వెదురు గుళికలు



నల్లగొండ మండలం ఎం.దుప్పలపల్లిలో వెదురుసాగును పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి అనంతరెడ్డి



కాలుష్య నియంత్రణే లక్ష్యంగా..

థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్లలో వినియోగించే బొగ్గుతో పెద్ద ఎత్తున కాలుష్యం వెలువడుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా వెదురును గుళికలరూపంలో తయారు చేసి థర్మల్ పవర్ ప్లాంట్లకు ఉపయోగించడం కోసం ప్రణాళికలను సిద్ధంచేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తొలి విడతలో 250 ఎకరాల్లో సాగు చేపట్టాలని, ఇందుకు రైతులను ప్రోత్సహించాలని నిర్ణయించింది.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

రాష్ట్ర ప్రభుత్వం వెదురు సాగును ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో జాతీయ వెదురు మిషన్ పథకం కింద రైతులకు రాయితీలు ఇవ్వనున్నారు. సాగును ప్రోత్సహించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా చర్యలు చేపడుతున్నారు. నల్లగొండ జిల్లాలో 90.44ఎకరాల్లో సాగు చేపడుతుండగా, మిగతా 160 ఎకరాల వరకు సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో చేపట్టనున్నారు. వరి సాగుకు అధిక నీటితో పాటు విద్యుత్ వినియోగం కూడా అధికమవుతుంది. దీంతో రైతులు పంటమార్పిడిలో భాగంగా వెదురును సాగుచేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు. రాబోయే రోజుల్లో వేలాది ఎకరాల్లో వెదురు సాగు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించడానికి ఈ వెదురు(ఆకుపచ్చ బంగారం)ను సారవంతంలేని భూముల్లో కూడా సాగు చేయవచ్చు. నీటి సౌకర్యం ఉంటే వెదురును సులభంగా సాగుచేసే అవకాశాలున్నాయి. రైతుల ఆర్థికవృద్ధికి దోహదపడే విధంగా ఈ పంటను గుర్తించారు. విస్తరణ పెరిగే కొద్ది మార్కెట్ కూడా పెరిగే అవకాశాలుంటాయి.

సాగుకు అనుకూలమైన వెదురు రకాలు



పొలాల్లో సాగుకు అనుకూలమైన రకాలను ఉద్యానశాఖ అధికారులు గుర్తించారు. ఉద్యానశాఖ ద్వారా జాతీయ వెదురు పథకం(ఎన్‌బీఎం) కింద వెదురు సాగు చేసే రైతులకు సబ్సిడీ అందజేస్తున్నారు. ఎకరాకు 50శాతం రాయితీ కింద రూ.24వేలు ఇస్తారు. ఇందులో మొదటి సంవత్సరం రూ.14,400, రెండో సంవత్సరం రూ.9600ను రైతుల ఖాతాలో నేరుగా జమ చేస్తారు. వెదురు రకాలను పరిశీలిస్తే బంబ్‌సాహుల్చా, బంబ్‌సాబాల్‌కోవా(బీమా వెదురు) ఇవి ముఖ్యంగా ఎత్తుగా, నిటారుగా పెరుగుతాయి. ఇవి అధిక దిగుబడి ఇస్తాయని గుర్తించారు. వీటితోపాటు డెండ్రో కెలామోస్ లాటిఫ్లోరెస్, డెండ్రో కెలామోస్ బాండ్రీసీ కూడా మూడున్నర సంవత్సరాల వ్యవధిలోని మొదటిసారి కోతకు వస్తుంది. మిగతా రకాలకు నాలుగేళ్ల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. అంతర పంటగా అల్లం, పసుపు సాగు చేయవచ్చు. ప్రస్తుతం వెదురుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మార్కెట్‌లో టన్ను వెదురు ధర రూ.3వేల నుంచి రూ.4వేల వరకు పలుకుతుంది. ఈ రకాల సాగుతో ఎకరాకు 40టన్నుల వరకు దిగుబడి చేసే అవకాశం ఉంది.

వెదురు గుళికలకు ప్రాముఖ్యం ఇవ్వడానికి..

రాష్ట్రంలో మొత్తం ఎనిమిది థర్మల్ పవర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటన్నింటికీ 10 శాతం కోఫైరింగ్ బయోమాస్ వెదురు గుళికలు (పెల్లెట్స్) తప్పకుండా వాడాలన్న పాలసీని మినిస్ట్రీ ఆఫ్ పవర్ 2021 సంవత్సరంలో సిఫారసు చేసింది. ఈ ఎనిమిది పవర్ ప్లాంట్ల రోజుకు 18,403 టన్నుల బాంబ్ పెల్లెట్స్ అవసరం ఉంటుంది. అంటే సంవత్సరానికి రూ.6700కోట్ల విలువైన వెదురు మార్కెటింగ్ రైతులకు లాభదాయకంగా మారనుంది. 67లక్షల వెదురు గుళికల లక్ష్యం సాధించడంకోసం వెదురు సాగును పెద్దఎత్తున చేపట్టడానికి సన్నాహాలు మొదలయ్యాయి. వెదురు సాగు వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి రావడంతోపాటు చీడ పీడలు, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. బొగ్గు వినియోగంతో ఏటా 21లక్షల టన్నుల కార్బన్‌డైఆక్సైడ్ విడుదలవుతుందని విద్యుత్ శాఖ నివేదికలో తెలిపింది. థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్‌లను వెదురు గుళికలు వాడటానికి ప్రధాన కారణం ఇందులో బూడిద శాతం తక్కువ ఉంటుంది. అంటే బొగ్గులో 20శాతం ఉంటే వెదురులో మాత్రం 1.5శాతం మాత్రమే బూడిద ఉంటుంది. బొగ్గును మండించే సమయంలో వెదురు గుళికలను 7శాతం వినియోగించాలని జాతీయ ఇంధన విధానంలో కేంద్రం స్పష్టం చేసింది. ఈ విధానంతో తెలంగాణలో వెదురుకు డిమాండ్ పెరిగింది. రాబోయే రోజుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెదురు సాగు భారీగా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వెదురు ఉత్పత్తులు.. గుళికల రూపంలోకి..

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా వెదురు సాగును ముమ్మరంగా చేపట్టి ఆ తర్వాత ఆ వెదురు ఉత్పత్తులను గుళికల (పెల్లెట్స్)లోకి మార్చడానికి నిర్ణయించారు. జాతీయ వెదురు మిషన్ పథకం కింద ఈ గుళికలను తయారుచేసి వాటిని.. మిగతా 4వ పేజీలో..

నిర్మాణరంగంపై.. ధరాఘాతం

సామాన్యులు, మధ్యతరగతి వారికి సొంత ఇంటి కల... ఇక కలగానే మిగిలిపోయేట్టు కనిపిస్తోంది. రెండు నెలల్లోనే స్టీలు, సిమెంటు, ఇసుక, ఇటుక ఇతరత్రా సామగ్రి ధరలు అనూహ్యంగా 50శాతం పెరిగాయి. దీంతో వ్యక్తిగత ఇల్లు, అపార్టుమెంట్ల నిర్మాణ వ్యయం అధికంకావడంతో సామాన్యులు, అపార్టుమెంట్ వెంచర్లు చేపట్టిన బిల్డర్లు తల పట్టుకుంటున్నారు. నిర్మాణ పనులను నిలిపివేశారు.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

● నిర్మాణ సామగ్రి ధరలు పైపైకి ● పెరిగిన సిమెంటు, ఐరన్ ధరలు
● రూ.300 నుంచి రూ.380వరకు పెరిగిన సిమెంటు బస్తా
● టన్నుకు రూ.3వేలు పెరిగిన స్టీలు ధరలు
● రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం
● సొంతగూడు కట్టుకునే వారిపై అదనపు భారం



భూదాన్‌పోచంపల్లిలో కొనసాగుతున్న భవన నిర్మాణం

పెరుగుతున్న సిమెంటు, స్టీలు ధరలు సామాన్యుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంటు, స్టీల్, ఇసుకతోపాటు శానిటరీ వస్తువుల ధరలు 50శాతం పెరిగాయి. రెండు నెలల క్రితం టన్ను స్టీల్ ధర రూ.45వేలు ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.65 వేలకు పెరిగింది. బస్తా (50 కిలోలు) సిమెంటు ధర రూ.220 నుంచి రూ.380కి ఎగబాకింది. కంకర ధర ట్రాక్టర్ (100ఫీట్లు) రూ.2400 నుంచి రూ.3400కు చేరుకున్నది. గృహ నిర్మాణానికి అవసరమైన ఇసుక ధర 30 శాతం పెరిగింది. ఇళ్లల్లో గోడలకు వేసే పెయింటింగ్ ధరలు కూడా 30 శాతం మేరకు పెరిగాయి. 20లీటర్ల డబ్బా రూ.1600 నుంచి రూ.1800లకు, ప్రీమియర్ రూ.2500 నుంచి రూ.2800కు పెరిగింది. వీటితోపాటు చెక్క, టైల్స్, గ్రానైట్, ఇలా అన్ని రకాల వస్తు సామగ్రి ధరలు పెరిగాయి. డీజిల్ ధరలు పెరగడంతో రవాణా చార్జీలు సైతం వాహన యజమానులు పెంచేశారు. నిర్మాణ సామగ్రి తరలించేందుకు డీసీఎం, లారీ యజమానులు గతంలో కనీస చార్జీ రూ.800 వసూలు చేస్తే ప్రస్తుతం రూ.1600 తీసుకుంటున్నారు. నిర్మాణంలో కీలకమైన విద్యుత్, ప్లంబింగ్ పైపుల ధరలు రెండింతలయ్యాయి. ఇంటి నిర్మాణంలో ఉపయోగించే ఎలక్ట్రికల్ వస్తువుల ధరలు 60శాతం పెరిగాయి.

ఫిబ్రవరిలో 50 శాతానికిపైగా..

రెండు నెలల కిందట టన్ను స్టీల్ ధర రూ.45 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.65వేలకు పెరిగింది. ఈ ఏడాది జనవరి తొలి వారంలో ఉన్న ధరలు ఒక్కసారిగా ఫిబ్రవరి నెలలో 50శాతానికి పెరిగాయి. జిల్లావ్యాప్తంగా 200 దుకాణాలకుపైగా ఉన్నాయి. ఏ కంపెనీ అయినా టన్ను రూ.60వేలు పైమాటే. నెలరోజుల వ్యవధిలో అన్ని కంపెనీల సిమెంటు ధరలు రూ.40నుంచి రూ.50 వరకు పెరిగింది.

కంపెనీల సిండికేట్

మార్కెట్లో కృత్రిమ కొరతను సృష్టించి నిర్మాణ సామగ్రి కంపెనీలు, సరఫరాదారులు ధరలు పెంచుతున్నారు. సిమెంటు కంపెనీలు ప్రతి నెలా 10 రోజులపాటు ఉత్పత్తి, సరఫరా నిలిపివేస్తున్నాయని ప్రచారం సాగుతోంది. దీంతో మార్కెట్లో ధరలు పెరిగేలా చేస్తున్నాయి.

గనుల శాఖ బాదుడు

భవన నిర్మాణ రంగంపై మరో పిడుగు పడింది. గనుల శాఖ అన్ని రకాల ఫీజులను పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే 30 నుంచి 40 శాతం పెరిగిన కంకర, ఇసుక ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

నిలిచిన నిర్మాణ పనులు

ఉమ్మడి జిల్లాలో రూ.వందల కోట్ల పెట్టుబడితో వందలాదిగా అపార్టుమెంట్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. ఇవేగాక వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలు వేలాదిగా ఉన్నాయి. సిమెంటు, స్టీలు ధరలు పెరగడంతో కొన్ని నిర్మాణాలు నిలిచిపోగా, మరికొన్ని నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ధరలు పెరగక ముందు ఒక డబుల్ బెడ్‌రూమ్ ఇంటి నిర్మాణానికి రూ.40లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య రేటుతో డిపాజిట్లు తీసుకున్న బిల్డర్లు ఇప్పుడు నిర్మాణవ్యయం దారుణంగా పెరగడంతో వాటిని ఎట్లా పూర్తిచేయాలో తెలియక తల పట్టుకుంటున్నారు. ఇప్పటి ధరలకు వీటిని పూర్తి చేయలేరు. నిర్మాణ పనులకు విరామం ఇవ్వాలనే ఆలోచనలో బిల్డర్లు ఉన్నారు. ఇదే జరిగితే కార్మికులు పనులు లేక రోడ్డున పడతారు.



సిమెంటు, ఐరన్ ధరలు విపరీతంగా పెరగడంతో వ్యాపారం బాగా తగ్గిపోయింది. రోజుకు 150 నుంచి 250 వరకు సిమెంటు బస్తాలు విక్రయించేవాళ్లం. కానీ, ప్రస్తుతం 100 సిమెంటు బస్తాలను కూడా విక్రయించలేకపోతున్నా.

వ్యాపారం తగ్గిపోయింది

సిమెంటుపై జీఎస్టీ 28శాతం నుంచి 18 శాతానికి తగ్గించాలి. అప్పుడు సిమెంటు రేటుపై కొంత భారం తగ్గే అవకాశం ఉంటుంది. వ్యాపారం జరిగేందుకు వెసలుబాటు ఉంటుంది.

ఇటమోని నరేందర్, సిమెంటు అండ్ ఐరన్ వ్యాపారి, భూదాన్‌పోచంపల్లి

సిమెంట్ బాటలోనే ఐరన్ ధరలు



నెల రోజుల క్రితం ఐరన్ టన్ను ధర రూ.60వేలు ఉండగా, ప్రస్తుతం రూ.65వేలకు పెరిగింది. వీటితోపాటు కలర్లు, ఇతర సామగ్రి ధరలు కూడా పెరిగాయి. రెండు నెలల క్రితం వరకు స్క్వేర్ ఫీట్ నిర్మాణ వ్యయం రూ.1700కాగా, ధరల పెరుగుదల కారణంగా రూ.2వేలకు చేరింది. ఒక్కో స్క్వేర్ ఫీటుపై రూ.300 అదనపు భారం పడుతోంది. రెండు వందల గజాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇంటి నిర్మాణానికి దాదాపు 800 బస్తాల సిమెంటు అవసరం ఉంటుంది. సిమెంటు బస్తాకు ధర రూ.50 పెరగడంతో రూ.40,000 అదనపు భారం పడుతోంది. అదేవిధంగా నాలుగు టన్నుల ఐరన్ అవసరం కాగా, టన్ను ధర రూ.5 వేలుచొప్పున పెరగడంతో మరో రూ.20వేలు అదనపు భారం పడుతోంది. ఈ రెండింటిపైన రూ.60వేలు అదనపు వ్యయం అవుతుంది. ఈనెలాఖరు నాటికి ధరల పెరుగుదల భారం రూ.లక్ష వరకు ఉంటుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ఇంటి నిర్మాణం కలగానే ఉంటుందని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

● వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



హైదరాబాద్‌లో తుమ్మల నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి మంత్రికి వినతిపత్రం అందజేశారు. సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగిన ప్రతీ రైతుకు త్వరగా రైతు భరోసా అందేలా చూడాలని, ఎరువులు, విత్తనాలు ఇచ్చేలా చొరవ చూపాలన్నారు. వీటితోపాటు 50శాతం సబ్సిడీతో వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు అందించాలని, ప్రణాళికను సిద్ధంచేసి యువతకు ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ లాభాల బాటలో ఉందని పేర్కొంటూ రైతులకు అందజేస్తున్న సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వర్‌రావు సానుకూలంగా స్పందించి రైతుల సంక్షేమంకోసం సొసైటీల బలోపేతంకోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు.

నిధులివ్వకుంటే కళాశాలలు బంద్

● ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఆందోళనబాటలో ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు
● నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి విన్నపం
● లేదంటే డిగ్రీ కళాశాలల మాదిరి బంద్‌కు కార్యాచరణ

ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాటపట్టనున్నాయి. నాలుగేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ ఇబ్బందిగా మారిందని, ప్రభుత్వం స్పందించకుంటే డిగ్రీ కళాశాలల మాదిరే ఆగస్టు నుంచి విద్యా సంస్థల బంద్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వానికి తమ ఇబ్బందులను నివేదించేందుకు అడ్ హక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ ప్రభుత్వం దృష్టికి తమ ఇబ్బందులను తీసుకెళ్లనుంది. (ఆంధ్రజ్యోతి-కోదాడ) 4

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ● ఏరియా ఆసుపత్రి వైద్యులతో సమీక్ష సమావేశం



మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చే రోగులకు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు, కార్మికులు, కూలీలు, పేద, మధ్యతరగతి ప్రజలు ఏదో రుగ్మతలతో బాధపడుతూ ఆసుపత్రికి వస్తుంటారన్నారు. అలాంటి వారికి దైవంతో సమానమైన వైద్యులు ధైర్యం చెప్పి తమ వైద్యసేవలతో సాంత్వన చేకూర్చేలా చూడాలన్నారు. సమయపాలన పాటించని వారు, డ్యూటీకి రాని వైద్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రిలోని వార్డులు శానిటైజ్ చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి దీటుగా ప్రభుత్వ వైద్యం అందించాలన్నారు. అన్ని వార్డుల్లో కలియదిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సమరధ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేశారు

గత పాలకులు మున్సిపాలిటీ ప్రజల సంక్షేమాన్ని మరిచి వ్యక్తిగత స్వలాభంకోసం రూ.లక్షల నిధులు దుర్వినియోగం చేశారని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ నేతలతో కలిసి పట్టణంలోని హనుమాన్‌పేట, రెడ్డికాలనీ, ముత్తిరెడ్డికుంట, తహసీల్దార్ కార్యాలయం వెనుక వీధి, సుందర్‌నగర్, రామాటాకీస్ వెనుక నుంచి చెరువు వరకు పర్యటించి ఓపెన్ డ్రైనేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా డ్రైనేజీ నిర్వహణను పట్టించుకోకపోవడంతో నాలా పరిసరాల ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారన్నారు. గత పాలకులు ధనార్జనే ధ్యేయంగా ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం వల్లే డ్రైనేజీ సమస్య జఠిలంగా మారిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్, సుందర్‌నగర్ ఇన్‌చార్జి అబ్దుల్లా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ కౌన్సిలర్ రవినాయక్ , 25 వార్డు ఇన్‌చార్జి జానకిరాం రెడ్డి, అడావత్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం..





యాదగిరీశుడి దివ్యక్షేత్రం ఆదివారం భక్తజనసంద్రమైంది. వేసవి సెలవులు, వారాంతపు సెలవు కలిసిరావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి ఇష్ట దైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో నిండిపోవడంతో స్థానికులు కాస్త ఇబ్బంది పడ్డారు. (యాదగిరిగుట్ట-ఆంధ్రజ్యోతి) 5

‘భూభారతి’పై ప్రజలకు వివరించాలి

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



పొంగులేటికి స్వాగతం పలుకుతున్న నాయకులు

మోతె, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూభారతి చట్టంపై నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మోతె మండలంలోని గోపతండా ఆవాసం గొల్లగూడెం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. భూభారతి చట్టంతో రైతులకు భూసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రెవెన్యూశాఖలో గ్రామ స్థాయిలో పనిచేసే ఉద్యోగులను త్వరలో కేటాయించడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూభారతి చట్టం అమలుకు ముందు కొన్ని మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమ లుచేశామన్నారు. గ్రామానికి వచ్చిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి మాజీ ఎంపీపీ ముప్పాని ఆశాశ్రీ కాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాణోత్ మాత్రునాయక్, సీనియర్ మండల నాయకుడు సామ వెంకట్ రెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొర్ర తిరుపతినాయక్, నవీన్ పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నేత రఘుపాల్ కన్నుమూత



● పార్థివ దేహం బీబీనగర్ ఎయిమ్స్‌కు అప్పగింత

5

ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

చింతపల్లి మే 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైల్ టికెట్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెట్రో టికెట్ ధరల పెంపు వల్ల లక్షలాది పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రయాణికులు ధరల పెంచడం వల్ల ట్రాఫిక్, కాలుష్య సమస్యలు తీవ్రమవుతాయని పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వేములపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్కునూరు క్రాస్‌రోడ్డు వద్ద గల శ్రీవిద్యానికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన 1999- 2000, 2003- 2004 పదవ తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని గత స్మృతులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గేనా?

● రోగాల బారిన పడుతున్న జంతువులు, ప్రజలు ● పట్టించుకోని అధికారులు

చింతపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్లాస్టిక్ వాడకం ఎక్కువవడంతో జీవ వైవిధ్యానికి పెనుముప్పు కలుగుతుంది. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా ప్రతి దుకాణాల్లో వాడుతున్నా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించడం లేదు.





వెంకటేశ్వరనగర్(మాల్)లో చెత్త కుప్పలో ప్లాస్టిక్ కవర్లు తింటున్న పశువులు

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం

చింతపల్లి మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ కవర్లు వాడకం విచ్చలవిడిగా పెరిగిపోతోంది. అటవీ, పర్యావరణ పరిరక్షణ 1986 చట్టం ఉత్తర్వు 25 ప్రకారం 40 మైక్రాన్లు (మందం) కంటే తక్కువ పాలిథీన్ సంచులను వాడకూడదు. తెలుపు కవర్లు తప్ప (నలుపు, నీలం) రంగు కవర్లు వాడటానికి ఆస్కారం లేదు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు వీటిని పర్యవేక్షిస్తారు. నిబంధనలు ఉన్నా రహస్య ప్రాంతాలు, గోదాముల్లో నిల్వచేసి పలు దుకాణాలు, హోటళ్లకు తక్కువ మైక్రాన్లు ఉన్న వాటిని విక్రయిస్తున్నారు. కవర్లతో మండలంలో లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు దాడులు, కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు.

అవగాహన కల్పిస్తే తగ్గనున్న వాడకం

ప్లాస్టిక్ వాడటంతో కలిగే అవర్థాల గురించి అధికారులు గ్రామస్థాయిలో కళాజాతా బృందాలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. పేపర్ గ్లాసులు, జూట్ సంచులు వినియోగించేలా అధికారులు చొరవ చూపాలి. ప్లాస్టిక్ నిషేధంపై యువకులు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహిస్తే కొంతవరకు ప్లాస్టిక్ కవర్ల నియంత్రణకు అడ్డుకట్ట వేయవచ్చు.

ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలు

- వాతావరణంలో కాలుష్యం పెరుగుతుంది.
- ప్లాస్టిక్‌లో ఉండే రసాయనాలు మొక్కలు పెరగకుండా అడ్డుకుంటాయి.
- భూసారం దెబ్బతింటుంది.
- వేడి ఆహార పదార్థాలు వీటిలో నిల్వ చేయడంతో ఆహారం పూర్తిగా విష పదార్థంగా మారుతుంది.
- ప్లాస్టిక్ రీసైక్లింగ్‌లో వచ్చే క్లోరినేటెడ్ హైడ్రోకార్బన్ నాడీ మండలాన్ని దెబ్బతీస్తుంది.
- మెదడుపై ప్రభావం చూపుతుంది.
- పిల్లలు ఊబకాయలుగా మారుతారు.
- లక్ష సంవత్సరాలు అయినా కరిగిపోదు.
- ప్లాస్టిక్ తినడం ద్వారా పశువులు, మేకలు, గొర్రెలు మూగజీవాలు మృత్యువాత పడతాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి



దుకాణాల్లో నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు తగినచర్యలు తీసుకోవాలి. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ నియంత్రించేలా తగిన చర్యలు తీసుకోవాలి.

- బోదాసు శ్రీనివాస్, పాఠశాల కరస్పాడెంట్ వీటీనగర్

జూట్ సంచులపై అవగాహన కల్పించాలి



రోజు రోజుకి ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు అధికమవుతున్నాయి. జూట్ సంచులు (బట్ట సంచులు)లపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. అధికారులు స్పందించకుంటే వాతావరణ కాలుష్యం ఏర్పడి జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

- కుక్కుడపు రామకృష్ణ, చింతపల్లి

కేసులు నమోదు చేస్తాం



40 మైక్రాన్ల కంటే తక్కువ నాణ్యత గల పాలిథీన్ కవర్లు వాడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం. కొన్ని గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి సుమారుగా 2 క్వింటాళ్ల వరకు ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశాం. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. జరిమానాలు విధిస్తున్నాం. ఎవరైనా వినియోగిస్తే మా దృష్టికి తీసుకురావాలి.

- సుజాత, ఎంపీడీవో, చింతపల్లి

రేపటి నుంచి ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

డిండి, మే 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులకు ఈ నెల 20వ తేదీ నుంచి వృత్యంతర శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో గోప్యానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చెర్కుపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శిక్షణ జరిగే ఐదు రోజుల పాటు ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్ జియోట్యాగింగ్ ఆధారిత హాజరును తీసుకోనున్నట్లు తెలిపారు. శిక్షణ ముగిసిన తర్వాత ఆన్‌లైన్ హాజరు సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ మ్యాడ్యుల్స్ తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రీ టెస్ట్, చివరి రోజు పోస్ట్ టెస్ట్ ఉపాధ్యాయులు రాయాల్సి ఉంటుందని తెలిపారు. శిక్షణకు హాజరుకాని వారిపై డీఈవో చర్యలు తీసుకుంటారని తెలిపారు.

వెంకటాద్రిపాలెంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపాలెం పరిధిలో గల జంకుతండాలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జంకుతండాలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటాద్రిపాలెం ఇండస్ట్రియల్ ఏరియాలో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు ఆరోపించారు. జంకుతండాలో పేదలు తాగునీటికి, నిత్యావసరాలకు నీరు లేక ఒక్కొక్క ఇంటికి రూ. 500, రూ.1000 ఖర్చు చేసి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని అన్నారు. అయినా నీరు సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధికారులు గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఐ కార్యకర్త అంజనపల్లి రామలింగం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు దాసర్ల దుర్గమ్మ, భిక్షం, స్వామి, కోటమ్మ, లీలమ్మ, సైదమ్మ, వెంకటయ్య, విజయ్, లక్ష్మమ్మ, మస్తాన్, సంధ్య, రజియాబేగం, తులసీ, చింటూ, భిక్షమమ్మ పాల్గొన్నారు.

జాతరలతో ఆధ్యాత్మిక శోభ

● అడవిదేవులపల్లిలో వైభవంగా మహిషాసురమర్ధిని ఉత్సవాలు



అడవిదేవుపల్లిలోని మహిషాసురమర్దిని ఆలయం, (ఇన్‌సెట్‌లో) మహిషాసురమర్దిని అమ్మవారు

అడవిదేవులపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న మహిషాసురమర్ధిని అమ్మవారి జాతర ఆదివారం ప్రారంభమైంది. అమ్మవారి జాతర 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి జాతరకు సమీప మండలాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఆదివారం వైభవంగా బియ్యంకోల కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం 19న పుట్టాను, 20న పుట్ట బంగారం, 21న జలబిందెలు, 22న సిరిమాను, 23న కుంకుమ బండ్లు, 24న దుర్గమ్మ బలి, 25న ఈదమ్మ బలి, 26న దీవెనబండారి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంగరంగ వైభవంగా జరిగే అమ్మవారి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ఆలయ కమిటీ సభ్యులు తాగునీరు, వైద్య శిబిరం, విద్యుత్ ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం మిర్యాలగూడ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

● కల్లేపల్లిలో

బంగారు మైసమ్మతల్లి జాతర



బంగారు మైసమ్మ తల్లి

దామరచర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లెపల్లి గ్రామంలో కొలువైన బంగారు మైసమ్మతల్లి జాతరను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ రెండేళ్లకోసారి అమ్మవారి జాతరను పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.



అమ్మవారి జాతరకు హాజరైన భక్తులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● ఉపాధిహామీ ఏపీడీ నవీన్

దేవరకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అం దరికీ పని కల్పించాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జాతీయ ఉపాధిహామీ పథకం జిల్లా ఏపీడీ నవీన్ అన్నారు. దేవరకొండలో పట్టణంలోని ఎం పీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉపాధిహామీ ఓపెన్‌ఫోరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవరకొండ మండలంలో 2024 - 25 సంవత్సరానికిగాను మండలంలోని 39 గ్రామపంచాయతీలలో 1023 పనులు చేపట్టినట్లు తె లిపారు. రూ.7కోట్ల 93 లక్షల 47వేలు కూలీలకు వేతనాలు అందజేశామన్నారు. రూ.10లక్షల 79వేల 565లతో నర్సరీలు, సామగ్రికి అందజేసినట్లు తెలిపారు. ఓపెన్‌ఫోరంలో చిన్న చిన్న కొలతలలో చిన్న చిన్న పొరపాట్లు దొర్లాయని, వాటిని సరిచేసుకోవాలని అధికారులను సూచించారు. ప్రతీ ఒక్కరికి రూ.300 గిట్టుబాటు అయ్యే లా పని కల్పించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం దేవరకొండ క్లస్టర్ ఏపీడీ యామిని, ఎంపీడీవో డానియెల్, ఏపీవో రామచంద్రయ్య, సోషల్ ఆడిట్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

30 రేషన్ దుకాణాలకు 305 మంది అభ్యర్థులు

● రేషన్ డీలర్ల ఎంపిక పరీక్షకు హాజరు



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్

మిర్యాలగూడ, మే 18(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని 30 రేషన్ దుకాణాలకు డీలర్ల ఎంపిక పరీక్షకు 305మంది అభ్యర్థులు హాజరైనట్లు సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ తెలిపారు. కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 30 దుకాణాలకు 365 మంది దరఖాస్తు చేసుకోగా 305 మంది పరీక్ష హాజరైనట్లు ఆయన తెలిపారు. మొత్తం 80 మార్కుల ప్రశ్నపత్రంలో ప్రజా పంపిణీపై, డీలర్ల రికార్డుల నిర్వహణ, పౌరసరఫరాల వ్యవస్థపై అవగాహన, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ మ్యాథ్స్‌పై మల్టీపుల్ చాయిస్‌తో కూడిన ప్రశ్నలు ఇచ్చినట్లు తెలిపారు. పరీక్ష తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, మూడు భాషల్లో రాత పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 32 కనీస మార్కులు పొందిన వారిని అర్హులుగా ప్రకటిస్తామని వెల్లడించారు. 1:5 నిష్పత్తి ప్రకారం 20 మార్కులకు ఇంటర్వ్యూకు పిలిచి మొత్తం వంద మార్కుల్లో అధిక మార్కులు వచ్చిన వారిని ఎంపిక చేయనున్నట్లు ఆయన వివరించారు.

మహిళలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

మిర్యాలగూడ టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ అన్నారు. పట్టణంలోని హనుమాన్‌పేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు మహిళలను నిర్లక్ష్యం చేయగా సీఎం రేవంత్‌రెడ్డి మహిళాభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టేందుకు రేవంత్ సర్కార్ రైస్ మిల్లులు, పెట్రోల్ బంక్‌లు, సోలార్ పవర్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందిర మహిళా శక్తి పేరుతో తెలంగాణ ఆడబిడ్డలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న తీరు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందన్నారు. సమావేశంలో నాయకులు కుప్పాల సుబ్బారావు, పసుపులేటి శివ, వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, వీరన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో పిల్లలకు ప్రయోజనం

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



విద్యార్థులకు జెర్సీలు బహూకరిస్తున్న పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, మే 18(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిబిరాలు బాలబాలికలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్‌వీఆర్ యూత్ ఆధ్వర్యంలో బీఎల్ఆర్ బ్రదర్స్ క్రీడా వేసవి శిబిరంలో వాలీబాల్, హ్యాండ్‌బాల్ ఇతర క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులకు టీషర్ట్‌లను, క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, ధనిక అంతరాలు లేకుండా కుల, మతాలకు తావులేకుండా సమష్టిగా విజయాలను అందుకునే తత్వాన్ని క్రీడల ద్వారా విద్యార్థులు అలవర్చుకుంటారని అన్నారు. ఇరుకు ఇళ్లల్లో ఆటస్థలం లేకపోవడం వల్ల తల్లిదండ్రులకు తమ పిల్లలను ఆటలు ఆడించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. పోటీ యుగంలో పిల్లల్లో ఆలోచనాశక్తి మెరుగుపడలాంటే సరైన వ్యాయామం, తోటి పిల్లల మధ్య సమన్వయం అవసరం అవుతుందన్నారు. క్రీడల వల్ల పిల్లల్లో సమష్టి తత్వం, గెలవాలనే తపన పరిస్థితులకు తగినట్లు ఎత్తులు వేస్తూ ఎదుటి జట్టును ఓడించాలనే లక్ష్యం ఏర్పడుతాయని, ఆలోచానాశక్తి పిల్లలకు సమకూరుతుందని అన్నారు. పరిసర ప్రాంతాల పిల్లలందరూ వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూనియర్ కళాశాల మైదానంలో నూతనంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను ఆయన పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వేసవి శిబిరం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణ్, మేడ మహేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవినాయక్, కొమ్ము శ్రీనివాస్, చక్రి, గార్లపాటి శేఖర్‌రెడ్డి, జనకిరాంరెడ్డి, బూడిద సైదులు, గూడపురి లక్ష్మణ్, సీనియర్ పీఈటీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సేవాదళ్ పట్టణ అధ్యక్షుడు అడోత్‌అశోక్, నాగునాయక్, కోచ్‌లు నాగరాజు, అశోక్, ఉపాధ్యాయులు కృష్ణాకాంత్, వెంకన్న, వాలీబాల్ మాజీ జాతీయ ప్లేయర్ దాసరి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కోసం కలిసికట్టుగా ఉండాలి

● ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

హాలియా, మే 17(ఆంధ్రజ్యోతి): గుడి నిర్మాణంలో కలిసికట్టుగా పని చేసిన చల్మారెడ్డిగూడెం గ్రామస్థులు గ్రామాభివృద్ధికి కూడా అదే స్ఫూర్తితో ఉండాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చల్మారెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన రామాలయ విగ్రహ, ధ్వజస్థంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత మంచి రాతి ఆలయం నిర్మించిన గ్రామస్థులకు, పెద్దలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రావుల చినబిక్షం, రావుల శ్రీనివాస్‌యాదవ్, రావుల రాంబాబు, గౌని రాజారమేష్‌యాదవ్, కుంటిగొర్ల శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయాదవ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

చల్మారెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో అల్లి పెద్దిరాజు, యడవల్లి దిలీప్‌రెడ్డి, బుర్రి రాంరెడ్డి, నడ్డి లింగయ్య, వడ్డే సతీష్‌రెడ్డి, రావుల చినబిక్షం, రాంబాబు, సాగర్, విజయేందర్, మధు, వెంకట్‌రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చేగొండి కృష్ణ, జలీల్, అయ్యప్పరెడ్డి, ఆంజనేయులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.